తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

ఖమ్మం - నల్లగొండ

భద్రాద్రి కొత్తగూడెం | సూర్యాపేట | యాద్రాద్రి భువనగిరి

శనివారం 31 ఆగష్టు 2024 | పేజీలు : 08


# కూలిపోయే ప్రాజెక్టు లక్ష కోట్లు ఖర్చు చేశారు

**పదేళ్లుగా పునాది గాని, పెళ్లాయి పెళ్లి, ధర్మారెడ్డి కాలువలను పై వివక్షత చూపారు : మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్**

**భువనగిరి ప్రతినిధి, ఆగస్టు 30 (జనం సాక్షి)** కూలిపోయే కాలేశ్వరం కి లక్ష కోట్ల రూపాయలు ఖర్చు పెట్టిన గత ప్రభుత్వం పది సంవత్సరాలుగా పునాది గాని పెళ్లాయి పెళ్లి ధర్మారెడ్డి కాలువల నిర్లక్ష్యం చేశారని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విమర్శించారు.భువనగిరి పట్టణ శివారు అనాజిపురం గ్రామంలో న్యూ డైమెన్షన్ పాఠశాలలో భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ నీటిపారుదల శాఖ పనులపై సమీక్ష సమావేశంహాజరైన ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిసమీక్ష సమావేశంలో రాజగోపాల్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.కూలిపోయే కాలేశ్వరానికి లక్ష కోట్లు ఖర్చు పెట్టింది గత ప్రభుత్వం.గత 10 ఏళ్లుగా బునాదిగాని , పిలాయిపల్లి , ధర్మారెడ్డి కాల్వలపై వివక్ష చూపించింది ప్రాంత రైతాంగానే అన్ని విధాలుగా నష్టపరిచిందని అన్నారు.గతంలో ఎంపీగా ఉన్న సమయంలో రైతుల ఇబ్బందులు చూసి నా సొంత డబ్బులతో కాలువ పనులు చేశానని గుర్తు చేశారు. మన ప్రభుత్వం వచ్చింది నాలుగు సంవత్సరాలలో అధికారంలో నే ఉంటాం..డిజైన్లు, డైమెన్షన్స్ దూరదృష్టి ఉండేలా రూపొందించాలి సూచించారు. శాశ్వతంగా పరిష్కారం ఉండేలా డిపిఆర్ లు సిద్ధం చేయాలి అన్నారు.ఈ ప్రాంత ప్రజలు మూసి కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నారు హైదరాబాద్ నగర కాలుష్యంతో కాకుండా కెమికల్ కంపెనీల వ్యర్థాలు కూడా కలుస్తున్నాయి అని మూసి జలాలు హానికరం గా మారిపోయినట్లు ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో బస్వాపూర్ రిజర్వాయర్ నుండి గోదావరి నీటిని ఈ కాలువలకు మళ్ళించాలి...



శాశ్వత పరిష్కారం అందించే డిపిఆర్ లతో నీటిపారుదల శాఖ మంత్రి ఛాంబర్ లో సమీక్ష చేసి ఈ ప్రాంత ప్రజల ఇబ్బందులు తొలగించాలి కోరారు.

# గణేష్ నవరాత్రులను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

**దమ్మపేట ఎస్సై సాయి సాయి కిషోర్ రెడ్డి..**



**దమ్మపేట ఆగస్టు 30 (జనం సాక్షి):** దమ్మపేట మండల పరిధిలోనీ గణేష్ మండపాల నిర్వహకులు పోలీసుల అనుమతిని తప్పనిసరిగా తీసుకోవాలనీ దమ్మపేట ఎస్సై తెలిపారు,ఇందుకోసం ముందుగా నిర్వహకులు తాము ఏర్పాటు చేసే గణేష్ ప్రతిమ ఎత్తు, ఏర్పాటు చేస్తున్న ప్రదేశం,నిమజ్జనం తేదీ,ప్రదేశం మొదలైన సమాచారంతో తెలంగాణ పోలీస్ శాఖ అధ్వర్యంలో నిర్వహిస్తున్న పోలీస్ ప్రోటోకాల్ వెబ్సైట్ https://policeportal.tspolice.gov.in ద్వారా మండపాల నిర్వహకులు పూర్తి వివరాలను నమోదుచేసుకోని రిజిస్ట్రేషన్ చేసుకోవాలనీ దరఖాస్తు చేసుకున్న అనంతరం సంబంధిత స్టేషన్ పోలీస్ అధికారులు ఆన్లైన్ ద్వారా అనుమతులు జారీచేస్తారని తెలిపారు,గణేష్ మండపాలను ఎవరికి ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా ఏర్పాటు చేసుకోవాలి.మండపం మిగతా 2లో..



# కిన్నెరసాని ఎడమ కాలువ గండి పూడ్చివేత

**బూర్గంపహాడ్ ఆగష్టు 30 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల పరిధిలోని వేపలగడ్డ నకిరిపేట గ్రామాల మధ్య కిన్నెరసాని ఎడమకాలువ 20.200 వద్ద ఆగస్టు 7వ తేదీన గండి పడిన విషయం పాఠకులకు విధితమే. ఎడమకాలువకు గండి పడటంతో ఐదు ఎకరాల్లో వరినార్లు పోసుకున్న పొలాలకు చేరడంతో రైతులు కొంతమేర నష్టపోయారు. కిన్నెరసాని ఎడమ కాలువకు వేపలగడ్డ-నకిరిపేట వద్ద గండి పడిన విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఆయన చొరవతో ఇరిగేషన్ ఏఈ రాజీవ్ త్వరితగతిన మిగతా 2లో..

# రహదారి సౌకర్యం లేదు.. రూట్ మ్యాప్ చూపిస్తుంది

- రేగళ్ల ,మర్కోడు రహదారి లేక అవస్థలు
- పది కిలోమీటర్ల రోడ్డు పూర్తి అయితే ప్రయాణం సులభతరం
- లారీ డ్రైవర్ అవస్థలు



**ఆళ్లపల్లి ఆగష్టు30( జనంసాక్షి):** సరైన రహదారి సౌకర్యం లేదు కానీ రూట్ మ్యాప్ మాత్రం చూపిస్తుంది. రేగళ్ల, మర్కోడు రోడ్డు మధ్యలో పది కిలోమీటర్లు సరైన రహదారి లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శుక్రవారం విశాఖపట్నం నుండి పినపాక నియోజకవర్గం లోని ఏడుల్ల బయ్యారం కి మందు కట్టలతో లారీ డ్రైవర్ రూట్ మ్యాప్ పెట్టుకొని బయలుదేరాడు. ఆళ్లపల్లి, మర్కోడు మీదుగా రూట్ మ్యాప్ ద్వారా ప్రయాణం చేశారు. అడవి ప్రాంతంలో సరైన రహదారి లేకపోవడంతో లారి కాలువలో దిగబడింది. దీంతో జెసిబితో లారీని తీశారు. కానీ ఈ రహదారి వెంట అనేకసార్లు వాహనదారులు రూట్ మ్యాప్ ద్వారా మర్కోడు గ్రామం వరకు వచ్చి రహదారి సరిగా లేకపోవడంతో వెనుక తిరిగిన సంఘటనలు ఉన్నాయి.ఆటోలు ద్విచక్ర వాహనాలు నిరంతరం నడుస్తూ ఉంటాయి. వర్షాకాలం సమయంలో రహదారి మొత్తం గుంతల మయంగా మారుతుంది. మేడారం వెళ్లడానికి పలు పట్టణాల నుండి మిగతా 2లో..

# అటవీ శాఖ అధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఎమ్మెల్యేకి వినతి పత్రం..

## సమస్య పరిష్కరిస్తానని రైతులకు హామీ ఇచ్చిన ఎమ్మెల్యే వెంకటరావు



**భద్రాచలం, ఆగస్టు 30 (జనంసాక్షి):** దుమ్ముగూడెం మండలంలో ఉన్న మారాయిగూడెం, భీమవరం రెండు గ్రామాలకు సంబంధించిన 16 మంది ఆదివాసి రైతులు శుక్రవారం భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుకి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు, సిపిఎం దుమ్ముగూడెం మండల కార్యదర్శి కారం పుల్లయ్య, ఎమ్మెల్యే వెంకటరావుతో.. సర్వేనెంబర్ 39/పి 16 ఎకరాలు జామాయిల్, పత్తి లాంటి పంటలు వేసి సాగు చేస్తున్న భూములను ఇప్పుడు రెవిన్యూ అధికారులు వచ్చి ఫారెస్ట్ డిపార్ట్మెంట్ కు రాసి ఇచ్చామని వాళ్లను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఎమ్మెల్యే కి వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే వెంకటరావు దుమ్ముగూడెం తాసిల్దార్ కి ఫోన్ చేసి ఆదివాసీలు సాగు చేస్తున్న భూములను ఫారెస్ట్ డిపార్ట్మెంట్ కి ఏ విధంగా రాసిస్తారని ఇది సరైన పద్ధతి కాదని వెంటనే నిలుపుదల చేయాలని ఆయన తాసిల్దార్ ని ఆదేశించడం జరిగింది. అవసరం అయితే రెవిన్యూ శాఖ మంత్రి తో మాట్లాడి ఆదివాసీల సమస్య పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తానని ఆయన అయినా రైతులకు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు, రైతులు సోంది అర్జున్ ,సోడి చిన్న వెంకటేష్, సొంది జోగయ్య, రాజు, సరియం చిన్న వీరయ్య, సోడి భద్రయ్య, సోడి పెద్ద వెంకటేష్, రామారావు, కల్లూరి భద్రయ్య, సోందే అనిల్ కుమార్, ఇంకా తదితరులు పాల్గొన్నారు.

# సెప్టెంబర్ 1న శ్రీసాయి వైష్ణవి సైనిక్ అకాడమీ మెగా టాలెంట్ టెస్ట్

**సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి):** సైనిక్ స్కూల్లో తమ పిల్లలను చదివించాలనుకునే తల్లిదండ్రుల కలలను సాకారం చేసేందుకు ప్రతిష్టాత్మకంగా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ రోడ్డులో శ్రీ సాయి వైష్ణవి సైనిక్ అకాడమీని ప్రారంభిస్తున్నట్లు అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ గొట్టిపర్తి శ్రీకాంత్, అకడమిక్ డైరెక్టర్ జి.కృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సైనిక్ అకాడమీలో ప్రవేశం పొందేందుకు సెప్టెంబర్ 1న 5,6,7,8 తరగతుల విద్యార్థులకు మెగా టాలెంట్ టెస్టును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 5,6వ తరగతుల విద్యార్థులకు సెప్టెంబర్ 1న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 7, 8వ తరగతుల విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు తెలిపారు.ఈ టాలెంట్ టెస్ట్లో ప్రతి తరగతి నుంచి మొదటి బహుమతి రూ. 5116, ద్వితీయ 3116, తృతీయ 2116 అందజేయడం జరుగుతుందన్నారు. అంతే కాకుండా ప్రతి విద్యార్థికి ప్రశంసాపత్రంతో పాటు 1 నుంచి 10వ ర్యాంకు లోపు వచ్చిన విద్యార్థులకు ఫీజులో రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు.పది రోజుల పాటు డెమో నిర్వహించడం జరుగుతుందని, సీట్లు పరిమిత సంఖ్యలో ఉన్నట్లు చెప్పారు.మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 9951231639, 9951433666లలో సంప్రదించవచ్చని తెలిపారు. మెగా టాలెంట్ టెస్ట్లో పాల్గొనదలిచే విద్యార్థులు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

1/70 యాక్ట్ ను తుంగలోకి తొక్కి నిర్మాణాలు

చేష్టలుడిగిన అధికారులు..

చుంచుపల్లి లో హైడ్రా తరహా చట్టం కోరుతున్న స్థానికులు..

# బఫర్ జోన్‌లో భారీగా బట్టల కొట్లు




**బ్యూరో భద్రాద్రి కొత్తగూడెం జూలై (30) జనం సాక్షి**

చట్టం ఉన్న వాడి చుట్టం అయితే నిబంధనలు ఎలా తుంగలోకి తొక్కవచ్చో ఈ ప్రాంతంలో జరిగే అక్రమ నిర్మాణాలు చూస్తే అర్థం అవుతుంది. ఓ వైపు గిరిజన చట్టాలు, మరో వైపు బఫర్ జోన్ నిబంధనలకు సైతం తూట్లు పొడుస్తూ యదేచ్ఛగా భారీ భవంతులు వెలుస్తున్నాయి. పట్టించుకోవాల్సిన అధికార గణం చేష్టలుడిగి పోయిందనే అరోపణలు వినిపిస్తున్నాయి. గిరిజన సంఘాలు, పర్యావరణ వేత్తలు ఎన్ని ఫిర్యాదులు చేసినా చెవిటి వాడి ముందుశంఖం అన్నట్లుగా తయారైంది. దీంతో చెరువులు, నాళాలు, డ్రైనేజీలు కనపడకుండా పోతున్నాయి. పర్యవసానంగా స్థానికులు అనేక సమస్యలు ఎదుర్కుంటున్నారు. వానలు వస్తే నరకం చూస్తున్నారు. చిన్నపాటి వర్షానికే ఇంటి ముందు నీరు నిలిచి అష్ట కష్టాలు పడుతున్నారు. ప్రధాన రహదారి నదిని తలపిస్తుంది. ఇదంతా జిల్లా కేంద్రంకు కూతవేటు దూరంలో ఉన్న చుంచుపల్లి మండలంలో జరుగుతున్న అక్రమాల కథ. ఈ ప్రాంతంతో పాటు సమీపాన ఉన్న లక్ష్మి దేవి పల్లిలో కూడా గిరిజనులు ఎక్కువగా నివసిస్తున్నారు. దీంతో ఈ రెండింటినీ ప్రభుత్వం 1/ 70 చట్ట పరిధిలోకి తెచ్చింది. నిబంధనల ప్రకారం ఇక్కడ కేవలం ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వారు మాత్రమే నివసించాలి. గిరిజనేతరులకు ఎటువంటి హక్కు ఉండదు. అటువంటిది ఇక్కడ ఇల్లు నిర్మించడమే కాదు ఏకంగా భారీ వాణిజ్య సముదాయాలు ఏర్పడ్డాయి. మరి కొన్ని నిర్మాణ దశలో ఉన్నాయి. అత్యంత సురక్షిత ప్రాంతంలో ఏర్పాటు చేయాల్సిన కార్పోరేట్ కంపెనీలకు చెందిన జీవి మాల్, సిఎంఆర్ షాపింగ్ మాల్ చెరువు పక్కనే నిర్మించారు. ప్రసిద్ధికెక్కిన గోల్డ్ షాప్ లతో పాటు సౌత్ ఇండియా, చెన్నై షాపింగ్ మాల్ లు ఏర్పాటుకు భారీ భవంతులు సిద్ధం చేస్తున్నారు. అయితే ఈ కట్టడాలు మొత్తం బఫర్ జోన్ లోనే జరుగుతుండడం గమనార్హం. నీటి ప్రవాహం ఉండే చోట ఈ స్థాయిలో భారీ భవంతుల నిర్మాణం అంత సేఫ్ కాదనీ పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నా అవేమీ అక్రమార్కుల చెవికి ఎక్కడం లేదు. గిరిజన సంఘాలు ఉద్యమాలు, కోర్టు మెట్లు ఎక్కుతున్న , జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం ఇస్తూ ఫిర్యాదులు చేస్తున్న అవేమీ ఫలితాన్ని ఇవ్వడం లేదు. చట్టాలను పరిరక్షించాల్సిన వారే దగ్గరుండి సహకరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఆ ప్రాంతం దాదాపు మునిగి పోయే పరిస్థితి కనిపించింది. చుట్టూ ఉండే చెరువులు కబ్జా చేసి ఇంటి నిర్మాణాలు చేపట్టడంతో వర్షపు నీరు ఎటూ వెళ్ళే పరిస్థితి లేక ఇళ్లల్లోకి, రోడ్ల పైకి వచ్చి స్థానికులు నరకయతన పడ్డారు. పలు ప్రాంతాలు బురదమయంగా మారి పందులు, దోమలకు ఆవాసంగా మారాయి. తద్వారా డెంగ్యూ, మలేరియా వంటి ప్రాణాంతక వ్యాధులకు గురవుతున్నారు. తీవ్ర దుర్గంధం మధ్య ప్రజలు ముక్కు మూసుకుని వెళ్ళాల్సిన పరి(దు)స్థితి నెలకొంది. ఇంతా జరుగుతున్నా సంభందిత అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది. చెరువులు, కుంటలు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హైద్రాబాద్ తరహా హైడ్రా చట్టాన్ని ఇక్కడ కూడా అమలు చేసి అక్రమ కట్టడాలు తొలగిస్తే తప్ప ఈ ప్రాంతంలో నివసించే పరిస్థితి లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.







## గణేష్ నవరాత్రులను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

### దమ్మపేట ఎస్సై సాయి సాయి కిషోర్ రెడ్డి..

ఏర్పాటు చేసే స్థలం కోసం సంబంధిత శాఖల వారితో అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలి.గణేష్ మండపాల కొరకు విద్యుత్ శాఖ వారి అనుమతితోనే కనెక్షన్ తీసుకోవాలి. షార్ట్ సర్క్యూట్ జరుగకుండా మంచి నాణ్యత గల వైరును ఉపయోగించాలి. గణేష్ మండపాల నిర్వాహకులు వారి మండపాల కమిటీ వివరాలు,మండపాల బాధ్యత వహించే వారి వివరాలు,ఫోన్ నెంబర్లతో కూడిన ఫ్లెక్సీలను మండపంలో ఏర్పాటు చేయాలి. వృద్ధులు,చదువుకునే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులకు కలగకుండా తక్కువ శబ్దకాలుష్యంతో స్పీకర్లను ఏర్పాటు చేసుకోవాలి.సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు రాత్రి 10 గంటల వరకు మాత్రమే స్పీకర్లను వినియోగించాలి. మండపాల్లో ఎట్టిపరిస్థితులోను డిజేలను ఏర్పాటు చేయరాదు.గణేష్ ప్రతిమలు కూర్చుండబెట్టే ప్రదేశంలో షెడ్ నిర్మాణంలో మంచి నాణ్యత గల షెడ్ ఏర్పాటు చేసుకోవాలిగణేష్ మండపంలో 24 గంటలు ఒక వ్యక్తి ఉండే విధంగా నిర్వహకులు తగు చర్యలు తీసుకోవాలి.గణేష్ మండపాల వద్ద ఎప్పుడైన అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ముందు జాగ్రత్తలో భాగంగా దగ్గరలో రెండు బకెట్ల నీళ్లు,ఇసుక ఏర్పాటు చేసుకోవాలి.గణేష్ మండపాల వద్ద మద్యం సేవించడం,పేకాట అడటం,లక్కీ డ్రాలు నిర్వహించడం,అసభ్యకరమైన నృత్యాల ఏర్పాటు,అన్యమతస్తులను కించపరిచే విధంగా ప్రసంగాలు చేయడం,పాటలు పాడటంపై పూర్తిగా నిషేధం.విధిగా పాయింట్ పుస్తకం ఏర్పాటు చేసుకోవాలి,పోలీసు అధికారులు తనిఖీకి వచ్చినప్పుడు అందులో వ్రాసి సంతకం చేస్తారు.మండపాల్లో ఏదైనా అనుమానాస్పదంగా బ్యాగులు,ప్లాస్టిక్ సంచులు,వస్తువులు లేదా వ్యక్తులు కనిపించినట్లుయితే తక్షణమే డయల్ 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలనీ తెలిపారు.

## రహదారి సౌకర్యం లేదు.. రూట్ మ్యాప్ చూపిస్తుంది

ఈ రహదారి వెంట ప్రయాణిస్తూ ఉంటారు .సుదూర ప్రాంతాల నుండి వచ్చేవారు తీరు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏదేమైనా ఖమ్మం ,మహబూబాబాద్ ,భద్రాద్రి కొత్తగూడెం, ములుగు ఈ పది కిలోమీటర్లు రహదారి నిర్మిస్తే సులువుగా ప్రయాణాలు చేయవచ్చని కొందరు అభిప్రాయపడుతున్నారు. పరిసర ప్రాంతాల్లో ఉన్న మండల వాసులకు రహదారి వెంట నిత్యం ప్రయాణం చేస్తూ ఉంటారు. అటవీశాఖ అనుమతులు లేక 10 కిలోమీటర్లు రోడ్డు ఆగినట్లుగా సమాచారం, 100 కి.మి చుట్టూ తిరిగి రాలేక ప్రస్తుతం ఆటోలు, ద్విచక్ర ,వాహనాలు ట్రాక్టర్లు ఈ రహదారి వెంట నడుస్తూ ఉంటాయి. ప్రయాణికులు అత్యవసర సమయంలో తీరాదారి వెంట ప్రయాణిస్తూ ఉంటామని తెలిపారు. వర్షాకాలం సమయంలో మట్టి రోడ్డు గుంతలుగా మారుతుందని పలువురు తెలిపారు. ఇప్పటికైనా స్పందించి రహదారి పూర్తి ఏ విధంగా చూడాలని పలువురు కోరుతున్నారు.

## కిన్నెరసాని ఎడమ కాలువ గండి పూడ్చివేత



గుత్తేదారు ద్వారా మరమ్మతులు చేపట్టి ఎట్టకేలకు గండిని పూడ్పించినట్లు తెలిపారు. దీంతో ఆయకట్టు పరిధిలోని రైతులు కిన్నెరసాని ఎడమకాలువ గండి పూడ్చడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.



## ఘనంగా సామూహిక వరలక్ష్మి వ్రతాలు

సూర్యాపేట (జనంసాక్షి):

జిల్లా కేంద్రంలోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలను ఘనంగా నిర్వహించారు. శ్రావణ మాసపు చివరి శుక్రవారం కావడంతో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వరలక్ష్మీ వ్రతాలను భక్తిశ్రద్ధలతో ఆచరించారు. దేవాలయ అర్చకులు అన్నవజ్జుల కృష్ణమూర్తి శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వరలక్ష్మిదేవి వ్రతకథను చదివి వినిపించారు.అంతకు ముందు మహిళా భక్తులచే లలితా పారాయణం,వాసవి పారాయణం నిర్వహించారు.అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో దేవాలయ ఉపాధ్యక్షులు శింగిరికొండ రవీందర్, ప్రధాన కార్యదర్శి ఈగ వెంకటేశ్వర్లు, కమిటీ సభ్యులు ఈగ రామయ్య, చిలుకల శ్రీనివాస్, దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## పంట నమోదు కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయండి

### వ్యవసాయ అధికారి పుల్లయ్య..

కూసుమంచి ఆగస్టు 30 ( జనం సాక్షి ) :
మండలంలోని కూసుమంచి రైతు వేదికలో రుణమాఫీలో భాగంగా రేషన్ కార్డు లేని రైతుల కుటుంబ నిర్ధారణ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ అధికారి శ్రీ పుల్లయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేషన్ కార్డు లేని రైతులందరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాల రైతులు సంబంధిత తేదీలలో ధ్రువీకరణ పత్రము రేషన్ కార్డు జిరాక్సు మొదలగు పత్రాలతో హాజరు అవ్వాలని సూచించారు. అదేవిధంగా ఏఈఓలకు పంట నమోదు కార్యక్రమం త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి డివిజన్ ఏడిఏ శ్రీమతి సరిత, మండల వ్యవసాయ అధికారిని శ్రీమతి రామడుగు వాణి ,టెక్నికల్ ఏవో అరుణ , వ్యవసాయ విస్తరణ అధికారులు ప్రియాంక, రవీందర్, మానస, రవికుమార్ పాల్గొన్నారు.

## పేద ప్రజల వైద్య సేవల కోసం సీఎంఆర్ఎఫ్, ఆడబిడ్డల వివాహాలకు కళ్యాణ లక్ష్మి , పథకాల ద్వారా ఆర్థిక చేయూత : ఎమ్మెల్యే మట్టా రాగమయి

కల్లూరు ఆగస్టు 30 (జనంసాక్షి):
పేదల ఆరోగ్య సంరక్షణలో భాగంగా పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ప్రజలకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుండి ఆర్థిక సహాయం, పేదింటి ఆడబిడ్డల వివాహానికి కళ్యాణ లక్ష్మి పథకం ద్వారా ఆర్థికంగా చేయూత నందిస్తూ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలన కొనసాగిస్తుందని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి స్పష్టం చేశారు. కల్లూరు లోని రైతు వేదికలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సీఎంఆర్ఎఫ్ ,కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అన్ని సామాజిక వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. . అనంతరం కల్లూరు మండలానికి సంబంధించి ముఖ్యమంత్రి సహాయ నిధి క్రింద 141మంది లబ్ధిదారులకు రూ. 35 ,69,500 లక్షల రూపాయల చెక్కులను, కళ్యాణ లక్ష్మీ %డ% షాదీ ముబారక్ కి సంబంధించిన 52మంది లబ్ధిదారులకు రూ.52,06,032 లక్షల రూపాయల చెక్కులను లబ్ధిదారులకు సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ అందజేశారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ పులి సాంబశివుడు, డిప్యూటీ తాసిల్దార్ బాబ్జి ప్రసాద్, ఎంపీడీవో చంద్రశేఖర్, కల్లూరు



ఏఎంసీ చైర్మన్ భాగం నీరజా దేవి ప్రభాకర్ చౌదరి, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏనుగు సత్యంబాబు, భాగం ప్రభాకర్ చౌదరి, ఆళ్లకుంట నరసింహారావు, అంకిరెడ్డి సత్య నారాయణరెడ్డి, లింగన్న బోయిన పుల్లారావు, కర్నాటి వెంకటరెడ్డి, మర్సకట్ల బాలశౌరి,మైనార్టీ సెల్ నాయకులు షేక్ బాజీ, పరిమి భరత్, బీరవెల్లి మాధవ్, మచ్చ వెంకటేశ్వరరావు. వివిధ గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ కార్పొరేషన్ చైర్మన్ ను కలిసిన పాపారావు గౌడ్

### శ్రీకాంత్ గౌడ్ దృష్టికి పలు సమస్యలు



బోనకల్ ,ఆగస్టు 30 (జనంసాక్షి):
తెలంగాణ రాష్ట్ర బీసీ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్ గౌడ్ ని బోనకల్ మండల బీసీ సెల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కందుల పాపారావు గౌడ్ మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా బీసీలకు సంబంధించిన పలు సమస్యలను, గీత కార్మికుల ఇబ్బందులను బీసీ కార్పొరేషన్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా నూతి శ్రీకాంత్ గౌడ్ స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వంలో బీసీలకు నా వంతు సహాయ సహకారాలు అందించి అర్హత కలిగిన వారికి బీసీ కార్పొరేషన్ ద్వారా రుణాలు ఇప్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ,అర్హత కలిగిన గీత కార్మికులకు అతి కొద్ది రోజుల్లో నూతన పెన్షన్లు మంజూరు చేయడం జరుగుతుందనీ, ప్రమాదవశాస్తూ చనిపోయిన గీత కార్మికులకు ఐదు లక్షలకు పెంచడం జరిగిందని, గీత కార్మికులకు ప్రభుత్వమే సబ్సిడీ ద్వారా మోకులను పంపిణీ చేస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు , గీత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలలో ప్రకటించిన హామీలను అమలు చేయాలి



బోనకల్ ,ఆగస్టు 30 (జనంసాక్షి):
రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చిన విధంగా ఉద్యోగ,ఉపాధ్యాయ, పెన్షనర్ల పెండింగ్ బిల్లులన్నింటిని వెంటనే చెల్లించాలని, నాలుగు డిఏలను మంజూరు చేయాలని,పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, తెలంగాణ రెండవ పిఆర్సి ని జూలై-2023 నుండి అమలు చేయాలని టీఎస్ యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక గురుకుల పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులనుద్దేశించి ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు గడిచినప్పటికిని, ఉద్యోగుల, ఉపాధ్యాయుల ,పెన్షనర్ల సమస్యలు పరిష్కారం కాలేదని విమర్శించారు. విద్య కమిషన్ ను ఏర్పాటు చేసి విద్యారంగంలో మార్పులు తీసుకురావాలని, ప్రతి పాఠశాలలో నర్సరీ ,కేజీ క్లాసులు ప్రారంభించాలని, తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రాథమిక పాఠశాలలకు ప్రధానోపాధ్యాయ పోస్టులను మంజూరు చేసి పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని, పర్యవేక్షణ అధికారుల ఖాళీలను నింపుటకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు.



## ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం విద్యార్థులకు పరీక్షలు చేసిన డాక్టర్ అల్తాఫ్

చింతకాని, ఆగష్టు 30(జనంసాక్షి)
చింతకాని మండల పరిధిలో లచ్చగూడెం కస్తూరిబా పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసే కార్యక్రమం చేపట్టారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు సూచనలు సలహాలు ఇచ్చారు అట్లాగే ప్రతి గ్రామంలో సీజనల్ వ్యాధుల పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలని అన్ని గ్రామాల్లో ఫీవర్ సర్వే చేశారు రామకృష్ణపురం బొప్పారం తదితర గ్రామాలలో జరిగిన డ్రై డే పనులు తనిఖీ చేసి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రజల సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం గా ఉండాలని చింతకాని ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ ఆల్తాఫ్ తెలిపారు. కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం లో దోమల నివారణ మందు పిచికారి చేసి పరిసరాల పరిశుభ్రత సీజనల్ వ్యాధులపై విద్యార్థినులకు వ్యక్తిగత పర్శిభ్రత పై స్టేషన్లో సలహాలు ఇచ్చారు ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సూపర్వైజర్ నాగేశ్వరరావు కస్తూర్బా పాఠశాల ఎస్ఓ కాంత కుమారి మంజుల, కాంచన పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రుణమాఫీ పై కుటుంబ సభ్యుల నిర్ధారణ సర్వే..

బూర్గంపహాడ్ ఆగష్టు 30 (జనంసాక్షి)
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల కేంద్రంలో రుణమాఫీ కాని రైతుల కుటుంబసభ్యుల వివరాలను ప్రత్యేక మొబైల్ యాప్లో సేకరించే సర్వేను వ్యవసాయ అధికారులు పకడ్బందీగా చేపట్టారు. శుక్రవారం మండల కేంద్రమైన బూర్గంపహాడ్ రైతువేదిక వద్ద రుణమాఫీ కాని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి ఫ్యామిలీ గ్రూపింగ్లో భాగంగా కుటుంబ నిర్ధారణ సర్వేను మండల వ్యవసాయాధికారి శంకర్ మొబైల్ యాప్లో నమోదు చేశారు. కుటుంబసభ్యుల ఫోటోలను యాప్లో అప్లోడ్ చేసి రైతు రుణమాఫీ వివరాల సమగ్రడేటాను అందులో పొందుపర్చారు. మండలంలో రుణమాఫీ కాని రైతులు గత రెండు రోజులుగా కార్యాలయానికి వచ్చి దరఖాస్తులు అందించి మొబైల్ యాప్లో వివరాలు నమోదు చేయించుకుంటున్నారన్నారు. గత రెండు రోజులుగా 1124 మందికి సంబంధించి ఫ్యామిలీ గ్రూపింగ్లో 204 మంది రైతుల వివరాలను పూర్తిస్థాయిలో నమోదు చేసినట్లు తెలిపారు. రైతుల ఇళ్లకు వెళ్లి ఈ సర్వే చేయాల్సి ఉండగా శనివారం వరకు ఇక్కడ రైతుల వివరాలు నమోదు చేస్తామని, సోమవారం నుంచి మండలవ్యాప్తంగా ఇంటింటికి వెళ్లి రైతుల నుంచి కుటుంబ నిర్ధారణ వివరాలు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇదిలా ఉండగా ఈ మొబైల్ యాప్ ద్వారా వివరాల నమోదుకు కొంత ఆలస్యం కావడంతో ఉదయమే వచ్చిన అన్నదాతలు గంటల తరబడి రుణమాఫీ నమోదు కోసం వేచిచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఏఈవోలు వైష్ణవి, ప్రసాద్, ఆత్మ ఏటీఎం పవన్ పాల్గొన్నారు.

## రుణమాఫీ సర్వేని తనిఖీ చేసిన మధిర ఏడిఏ

బోనకల్, ఆగస్టు 30( జనంసాక్షి): బోనకల్ మండల కేంద్రంలోని రైతు వేదిక నందు కొనసాగుతున్న రుణమాఫీ సర్వే కార్యక్రమాన్ని మధి వ్యవసాయ సంచాలకులు విజయ్ చంద్ర తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. మండల పరిధిలో బోనకల్ గ్రామంలో రేషన్ కార్డు లేని రైతుల కుటుంబ సభ్యుల నిర్ధారణ కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి కొండూరి విజయ భాస్కర్ రెడ్డి చే నిర్వహించబడింది. బోనకల్ గ్రామంలో నేడు నిర్వహించిన సర్వే లో మొత్తం 125 రైతు కుటుంబ సభ్యులకు గాను, 79 రైతు కుటుంబ సభ్యుల నిర్ధారణ చేయడం జరిగింది. షెడ్యూల్ ప్రకారం రేషన్ కార్డు లేని రైతులు ఆయా గ్రామాలలో ధ్రువీకరణ పత్రంతో పాటు, కుటుంబ సభ్యుల ఆధార్ జిరాక్సులు, లోన్ అకౌంట్ జిరాక్సులు, పట్టాదారు పాస్బుక్ నకలు వంటి వివరాలతో మండల వ్యవసాయ అధికారి , వ్యవసాయ విస్తరణ అధికారుల బృందాన్ని సంప్రదించాలి అని ఏడీఏ విజయ చంద్ర పేర్కొన్నారు. షెడ్యూలు ప్రకారం ఆగస్టు 31 వ తారీఖున రామాపురం, గార్లపాడు గ్రామ పంచాయతీ కార్యాలయాల నందు కుటుంబ సభ్యుల నిర్ధారణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది కావున అర్హత



ఉన్నటువంటి రైతులు గమనించి సంబంధిత పత్రాలతో వ్యవసాయ శాఖ బృందాన్ని సంప్రదించగలరని ఏడిఏ తెలియజేసారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు బంధం రజిత, మరీదు త్రివేణి, గోగుల హరికృష్ణ, బద్దల కార్తీక్, నాగినేని నాగసాయి , ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# కమ్యూనిస్టు కార్యాలయాలు ప్రజా సమస్యల పరిష్కారంపై పోరాడే కేంద్రాలు

## ఎర్రజెండా రాజ్యంలోనే ప్రజల బతుకులు మారుతాయి

## సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం




యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో ఆగస్టు 30 ( జనం సాక్షి):
కమ్యూనిస్టు కార్యాలయాలు రైతుల, వ్యవసాయ కూలీల, కార్మికుల, పేదల బతుకుల మార్పు కోసం, వారి హక్కుల కోసం పోరాడే కేంద్రాలుగా ఉపయోగపడతాయని ఎర్రజెండా రాజ్యంలోనే ప్రజల బతుకులలో మార్పు వస్తుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ తెలియజేసినారు. శుక్రవారం భూదాన్ పోచంపల్లి మండలం ఫిలాయిపల్లి గ్రామంలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు కళ్ళెం వీరారెడ్డి స్మారక భవనం (సిపిఎం కార్యాలయం) ను తమ్మినేని వీరభద్రం ప్రారంభోత్సవం చేసినారు ఈ సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభకు ముఖ్య అతిథులుగా మాట్లాడుతూ అధికారంలో ఉన్నా లేకున్నా పేద ప్రజల కోసం నిరంతరం పోరాటం చేసేదే కమ్యూనిస్టులేనని అన్నారు. పాలకులు ప్రజలకు అందించవలసిన విద్య, వైద్యం సరిగా ఇవ్వకపోవడంతో అనేకమంది పేదలు నిరుపేదలు సబండ వర్గాలు కార్పొరేట్ విద్యా, వైద్యం పొందలేక విద్యకు దూరమవుతూ వైద్యం పొందకా ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. ఎర్ర జెండా నీడన పరిపాలన జరుగుతున్న దేశాలతో విద్య వైద్యం ప్రజలకు ఉచితంగా అందిస్తున్నారని తెలియజేశారు. ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా వైద్యం ప్రజలకు ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. ఏడాదికి కోటి ఉద్యోగాలు ఇస్తానన్న మోడీ ప్రభుత్వము పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రైవేటు పరం చేస్తూ కార్పొరేట్ శక్తులకు కారు చౌకగా లాభాలు వచ్చే రంగాలను అప్పజెప్తూ నిరుద్యోగుల పుట్టలు కొడుతూ ప్రజల బతుకులతో కులం పేరుతో మతం పేరుతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. ఆనాడు కమ్యూనిస్టులు తెలంగాణ సాయుధ పోరాటము మొదలుకొని నేటి వరకు దున్నేవాడికి భూమి కావాలని వేలాదికరాల భూములను పేదలకు పంచారని తెలియజేశారు. గత ప్రభుత్వం పేదలకు, దళితులకు మూడెకరాల భూమి అమలు చేస్తానని చెప్పి చేయలేదని ఈ ప్రభుత్వము భూములను అక్రమించుకున్న వారి నుండి హైడ్రా పేరుతో భూములను తిరిగి తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామని దీనితో ఆగకుండా ఎక్కడైతే ప్రభుత్వ భూములు ఉన్నాయో ఆ భూములన్నీ భూమిలేని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. ఇంకా దేశంలో రాష్ట్రంలో సామాజిక అసమానతలు కొనసాగుతున్నాయని దాడులు దౌర్జన్యాలు కూడా నీటికి కొనసాగుతున్నాయని వేదన వెలిబుచ్చారు. అసమానతలు లేని రాజ్యం కోసం మనమందరము పాటుపడాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలు చేయాలని అన్నారు. కాంగ్రెస్ అనుసరించే విధానాల్లో లోపాలుంటే ఎత్తిచూపుతామని, ప్రజలకు నష్టం చేస్తే ఉద్యమిస్తామని, పేదల తరపున రైతుల తరపున కార్మికుల కర్షకుల పక్షాన నిరంతరం ఎర్రజెండా చేతబట్టి పోరాడుతామని తమ్మినేని వీరభద్రం తెలియజేశారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ కామ్రేడ్ కళ్లెం వీరారెడ్డి భూమికోసం, భుక్తి కోసం, పీడిత ప్రజల విముక్తి కోసం పోరాడిన గొప్ప నాయకుడని వారి స్ఫూర్తిని ఈనాటి యువతరం కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఆనాడు దొరలకు జాగిర్రు దారులకు వ్యతిరేకంగా దున్నివాడికి భూమి కావాలని, వెట్టి చాకిరి పోవాలని, కులవివక్ష పోవాలని పెద్ద ఎత్తున ఈ ప్రాంత సాయిధ పోరాట అమరవీరులు పోరాడినారని తెలియజేశారు. వీరారెడ్డి గారు విద్య కోసం పాఠశాల ప్రారంభించి అందరికీ విద్యను అందించారని, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రజలలో చైతన్యం తెచ్చారని తెలియజేశారు. గ్రామంలో సిపిఎం ఆధ్వర్యంలో భూమిలేని పేదలందరికీ ఆనాడు 250 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములను సాగు భూమి కోసం, ఇండ్ల స్థలాలు కోసం పంచారని, గ్రామంలో 20 సంవత్సరాల సిపిఎం పాలనలో గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపారని, కూలీ, భూమి, ఉపాధి, రైతాంగ సమస్యలపై రాజీ లేని పోరాటాలు నడిపిన చరిత్ర ఈ ప్రాంత సిపిఎం ఉన్నదని, ప్రజల పక్షాన పోరాడే ఎర్రజెండా పక్షాన పేదలంతా నిలబడాలని వారు పిలుపునిచ్చా. ఇంకా ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి యండి.జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, సీనియర్ నాయకులు గూడూరు అంజిరెడ్డి పాల్గొని మాట్లాడగా ఈ కార్యక్రమానికి సిపిఎం మండల కార్యదర్శి వర్గ సభ్యులు గూడూరు బుచ్చిరెడ్డి అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర నాయకులు బొంతల చంద్రారెడ్డి, రైతు సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు జంగారెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి పాండు, మేక అశోక్ రెడ్డి, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నర్సింహ, గడ్డం వెంకటేష్, బొడ్డుపల్లి వెంకటేష్, వనం ఉపేందర్, ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి వనం రాజు మండల కార్యదర్శి వర్గ సభ్యులు మంచాల మధు, అందెల జ్యోతి, కోట రామచంద్రారెడ్డి, ప్రసాదం విష్ణు, బీబీనగర్ సిపిఎం మండల కార్యదర్శి దాడి శ్రీనివాస్, శాఖ కార్యదర్శి పత్తి బిక్షపతి, మండల నాయకులు నోముల కృష్ణారెడ్డి, లాలయ్య, కొటా రమేష్, కంజర్ల అశోక్, అందేల యాదయ్య, అందాల అశోక్, చుక్క రవి, పగిళ్ల మల్లారెడ్డి, పగిళ్ల లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ లో ఉన్న బిల్లులు అన్నింటిని వెంటనే విడుదల చేయాలి..

## ఎస్ యుటిఎఫ్ రాష్ట్ర సాంస్కృతి కమిటీ కన్వీనర్ నల్ల నరసింహ




మర్రిగూడ, ఆగస్టు30( జనం సాక్షి )
పెండింగ్ లో ఉన్న బిల్లులు అన్నిటిని వెంటనే విడుదల చేయాలి,మర్రిగూడ మండల మహాసభ ల కు ముఖ్య అతిథిగా పాల్గొన్న టి ఎస్ యుటిఎఫ్ రాష్ట్ర సాంస్కృతి కమిటీ కన్వీనర్ నల్ల నరసింహ మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమకు రావాల్సిన హక్కులకు పోరాడుతూ సంఘ కార్యక్రమాల్లో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. యుటిఎఫ్ సంఘం నియమాలకు లోబడి క్రమశిక్షణతో నిబద్ధతతో ఉపాధ్యాయులు పని చేయాలని అన్నారు. ప్రభుత్వ విద్యా రంగ పరిరక్షణకు తమ వంతు కృషి చేయాలని అన్నారు.టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కాశిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా పెండింగ్ లో ఉన్న నాలుగు డి ఎ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఎం జె ఆర్ బిఈడి కళాశాలలో ఆ సంఘం అధ్యక్షురాలు శ్రీమతి పి.పరమేశ్వరి అధ్యక్షతన జరిగిన మండల మహాసభ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల బదిలీల షెడ్యూల్ ను వెంటనే ప్రకటించవలసిందిగా కోరారు. కస్తూరిబా సిబ్బందికి మినిమం టైం స్కేల్ ను మంజూరు చేయాలనికోరారు . మర్రిగూడమండలం నుండి ఇతర మండలాలకు బదిలీ, పదోన్నతి, పై వెళ్లిన కుటుంబ సంక్షేమనిధి సభ్యులకు మెమెంటో,శాలువా తో ఘనంగా సత్కరించారు.ఈ సమావేశంలో యూటీఎఫ్ సీనియర్ నాయకులు జి.బుచ్చయ్య, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు,జిల్లా కార్యదర్శి కె.యాదగిరి , కొండమల్లేపల్లి మండల అధ్యక్షులు జి.శ్రీరాములు, చింతపల్లి మండల అధ్యక్షులు జి. సత్యనారాయణ , జిల్లా ప్రతినిధి పరంగి,దీవంత, బద్దెలకృష్ణయ్య, ఉపేందర్, వెంకటేష్,వేణు ,పరంగి, బత్తుల యాదయ్య, సులేమాన్ ,శ్రవణ్ కుమార్,మంజుశ్రీ,నిర్మల, నవనీత ,నాగమణి, , హన్మంతు, సుజాత, వసిమున్నిసా, తదితరులు పాల్గొన్నారు.




# చిన్న పరిశ్రమలే దేశానికి వెన్నెముక

## నవభారత్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చిక్క ప్రభాకర్ గౌడ్

యాదాద్రి భువనగిరి జిల్లా బ్యూరో ఆగస్టు 30 (జనంసాక్షి)
చిన్న తరహా పరిశ్రమలే దేశానికి వెన్నెముక గా నిలిచి, దేశ సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడుతాయని నవభారత్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ చిక్కా ప్రభాకర్ గౌడ్ అన్నారు. శుక్రవారం భువనగిరి జిల్లా కేంద్రంలోని నవభారత్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో కేంద్ర ప్రభుత్వం “స్కిల్ ఇండియా” సహకారంతో ఏర్పాటు చేసిన విద్యార్థుల శిక్షణా,అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఆద్వర్యంలో 2021 నుండి ప్రతి ఏటా ఆగస్టు 30 న జాతీయ చిన్న పరిశ్రమల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని ఆయన గుర్తు చేశారు. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు చిన్న పరిశ్రమలను ప్రోత్సహించడం, ఆర్థిక సహాయం అందించడం ద్వారా నిరుద్యోగ సమస్యను పరిష్కరించతో పాటు, దేశాన్ని ఆర్దికంగా అగ్ర భాగాన నిలబెట్టవచ్చని ఆయన అన్నారు. కేంద్ర ప్రభుత్వ సఫల్ శిక్షణా కార్యక్రమంలో భాగంగా సీనియర్ రీసోర్స్ పర్సన్ ఎర్ర శివరాజ్ మాట్లాడుతూ కొన్ని దశాబ్దాల క్రితం ఇన్ఫోసిస్, రిలయన్స్ సంస్థలు కూడా చిన్న తరహా పరిశ్రమలు గానే ప్రారంభమై నేడు టాప్ టెన్ లో నిలిచాయన్నారు. విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు, పరిశ్రమల స్థాపనలో, స్వయం ఉపాధి అవకాశాలకు ప్రాదాన్యత ఇవ్వాలని కోరారు. పరిశ్రమల స్థాపనలో విద్యార్థులకు శిక్షణా మరియు అవగాహన సదస్సును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ రిసోర్స్ పర్సన్ ఎర్ర శివరాజ్, నవభారత్ కళాశాల అధ్యాపకులు ఫూల్ చంద్, సంతోష్ కుమార్, రీసోర్స్ పర్సన్లు వగ్గు క్రిస్టోఫర్, కొడారి వెంకటేష్, మాటూరి దశరథ, మహిపాల్ , హరిబాబు, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## బీజేపీ మండల సభ్యత్వ నమోదు ప్రారంభం

చింతపల్లి, ఆగస్టు 30(జనం సాక్షి)
చింతపల్లి మండల కేంద్రంలోని బిజేపీ కార్యాలయంలో మండల సభ్యత్వ నమోదు వర్క్ షాప్ మండల అధ్యక్షులు శివర్ల రమేష్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించారు,ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కర్నాటి సురేశ్ హాజరై ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 1వ తేదీ నుండి దేశవ్యాప్తంగా జరిగే భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు అంతా కష్టపడి పని చేసి ప్రతి బూతులో కనీసం 200 మందిని సభ్యులుగా చేర్పించాలని అన్నారు. రాబోయే రోజుల్లో గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయడం కోసం ప్రతి బూతు, ప్రతి గ్రామంలో అన్ని వర్గాల ప్రజలను సభ్యులుగా నమోదు చేయాలని అన్నారు.ఈ సమావేశంలో.బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు గోపిడి అనిల్ రెడ్డి, ఓ బి సి సెల్ జిల్లా కార్యదర్శి వెన్నమ్ శేఖర్ ,మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు మహేష్ గౌడ్,మండల ఉపాధ్యక్షులు క్రాంతి రెడ్డి, గంగల వెంకటయ్య, బీజేవైఎం మండల అధ్యక్షులు కుందేళ్ళ శ్రీశైలం యాదవ్ బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి గజ్జె అభినవ్ గౌడ్,అంజి, పాలకుర్ల రాజు,గడ్డి మహేందర్, తదితరులు పాల్గొన్నారు..





## వాహనాలు తనిఖీలు చేసిన ఎస్ఐ విజయలక్ష్మి

భద్రాచలం( క్రైమ్) ఆగస్టు 30 (జనం సాక్షి)
భద్రాచలం పట్టణంలోని బ్రిడ్జి సెంటర్ వద్ద ఎస్ఐ విజయలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం వాహనాలను తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. పత్రాలు లేని వాటిని గుర్తించి జరినామా వేశారు. హెల్మెట్ లేనివారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వాహనాలకు సంబంధించిన పత్రాలు ఉండాలన్నారు. ప్రయాణం చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ తనిఖీల్లో పట్టణ పోలీసులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఎస్ఐ మధు ప్రసాద్ ఆధ్వర్యంలో..
శుక్రవారం ఉదయం బ్రిడ్జి సెంటర్ వద్ద ట్రాఫిక్ ఎస్ఐ మధు ప్రసాద్ వాహనాల తనిఖీలు నిర్వహించారు. త్రిబుల్ రైడింగ్ తో పాటు నెంబర్ ప్లేట్ లేని వాహనాలను గుర్తించి చలానావేశారు. హెల్మెట్ లేని వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ తనిఖీల్లో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.



## ఇల్లు కాలిపోయిన మిత్రునికి ఆర్థిక సహాయం చేసిన తోటి మిత్రులు

భద్రాచలం, ఆగస్టు 30 (జనం సాక్షి):
దుమ్ముగూడెం మండలం, మంగువాయి బాడవ గ్రామం లో రెండు రోజులు క్రితం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు కాలిపోయి, సర్వం కోల్పోయి కట్టుబట్టలు తప్ప ఏమి మిగలని దీనపరిస్థితి లో ఉన్న మిత్రుడు పొడియం సురేష్ కుటుంబానికి,భరోసా గా అతని పదవ తరగతి స్నేహితులు రూ. 13300/- ఆర్థిక సహాయం అందించారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో పొడియం సురేష్ స్నేహితులు తోట రమేష్, సొందే మల్లు దొర, కోరం మురళి, తునికి నాగరాజు, పాయం కామేష్, సోయం వీరభద్రం, సోయం నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

## బదిలీపై, పదోన్నతులపై వెళ్తున్న ఉపాధ్యాయులకు సన్మానం

పాల్వంచ, ఆగస్టు 30 (జనంసాక్షి) :
ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీలల్లో బదిలీ పై వెళ్లిన ఉపాధ్యాయులను, అలాగే ప్రమోషన్స్ పొంది వివిధ పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులను పాఠశాల సముదాయ సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు అందరూ కలిసి సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. శుక్రవారం స్థానిక బొల్లోరుగూడెం ఉన్నత పాఠశాల కాంప్లెక్స్ పరిధిలోని వివిధ పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమంలో మొత్తం ప్రమోషన్స్ పై వెళ్లిన 20 మంది ఉపాధ్యాయులను, బదిలీపై వెళ్లిన 10మంది ఉపాధ్యాయులను మండల విద్యాశాఖ అధికారి శ్రీరామ్మూర్తి, మండల నోడల్ ఆఫీసర్ ప్రకాష్, కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయురాలు మంగమ్మ, కాంప్లెక్స్ అసిస్టెంట్ సెక్రటరీ శ్రీనివాస రెడ్డిల చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. ఇదే క్రమంలో వివిధ పాఠశాల నుండి వివిధ మండలాల నుండి బదిలీలపై ఈ కాంప్లెక్స్ పరిధిలోకి వచ్చిన ఉపాధ్యాయులను కూడా ఘనంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





## గిరిజనులకు 12శాతం రిజర్వేషన్ పెంచాలి

పాల్వంచ, ఆగస్టు 30 (జనంసాక్షి) :
గిరిజనులకు 12శాతం రిజర్వేషన్ పెంచి కాంగ్రెస్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సేవాలాల్ సేన రాష్ట్ర కన్వీనర్ బానోత్ హుస్సేన్ నాయక్ కోరారు. శుక్రవారం కేటిపిఎస్ గిరిజన ఉద్యోగుల భవన్‌లో సేవాలాల్ యువసేన జిల్లా అధ్యక్షులు బానోత్ భరత్ నాయక్ అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బంజారాలను గుర్తించి మంత్రి పదవి అప్పగించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయంలో ఓ గిరిజన ఉన్నతాధికారిని నియమించాలన్నారు. గిరిజనులచే శాస్త్రీయ సారా కేంద్రాలు ఏర్పాటు చేసి, విక్రయ కేంద్రాల ద్వారా జీవనోపాధి కల్పించాలన్నారు. ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటైన తండాలలో పెండింగ్ బిల్లులను వెంటనే మంజూరు చేయాలని, బంజారా సాంస్కృతిక బోర్డును ఏర్పాటు చేయాలని, బంజారా లు పవిత్రంగా జరుపుకునే తీజ్, సీట్లా పండుగలను జాతీయ పండుగగా గుర్తించాలని కోరారు. ఈ క్రమస్త్రంలో సెప్టెంబర్ 9న ఇందిరా పార్క్ హైదరాబాద్ నందు జరిగే గిరిజన సింహగర్జనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాలోత్ శివ నాయక్, పాపవత్ రాందాస్ నాయక్, బట్టు హుస్సేన్ నాయక్, పాల్వంచ, సుజాతనగర్, ఇల్లందు మండలాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## గేదె అడ్డుగా రావడంతో.. బైక్ ఢీకొని యువకుడు మృతి

పినపాక, ఆగస్టు 30(జనం సాక్షి):



గేదె అడ్డుగా రావడంతో యువకుడు మృతి చెందిన ఘటన పినపాక మండలం జానంపేట గ్రామంలో ప్రధాన రహదారిపై చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే జానంపేట గ్రామానికి చెందిన కట్టం సాయి (22) అనే యువకుడు తన బైక్ పై జానంపేట నుండి బైక్ పైన ఇంటికి వెళ్లే క్రమంలో ప్రధాన రహదారిపై గేదె అడ్డుగా రావడంతో బైక్ గేదెను ఢీకొంది. ఈ ప్రమాదంలో సాయికి తీవ్రగాయాలు కాగా గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేశారు. మణుగూరు హాస్పిటల్కు తరలించే లోపే సాయి మృతి చెందినట్లుగా మణుగూరు 100 పడక ఆసుపత్రి వైద్యులు తెలియజేశారు. మృతుడు మంత్రి సీతక్క కుమారుడు దనసరి సూర్య కు డ్రైవర్ గా పని చేశాడు. మృతి పై సూర్య ప్రగాఢ సానుభూతి తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదంపై పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రభుత్వ వైద్యశాలలో డిజిటల్ ఎక్స్‌రే మిషన్ ఏర్పాటు చేయాలి

### హెల్త్ సెంటర్‌కు నిధుల మంజూరి పట్ల హర్షం

పాల్వంచ, ఆగస్టు 30 (జనంసాక్షి) :



పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు గాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పాల్వంచ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో డిఎంఎఫ్‌టి నిధుల నుండి రూ.79.40 లక్షలు మంజూరు చేయటం హర్షినీయమని పాల్వంచ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గద్దల రమేష్ అన్నారు. ఈ శుక్రవారం ఓ ప్రకటనలో రమేష్ మాట్లాడుతూ పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో ఎముకల డాక్టర్ ఉండి కూడా సి-ఎ,ఆర్,ఎం మిషన్ లేక రోడ్డు ప్రమాదాలకు గురైనటువంటి, యాక్సిడెంట్ కేసులు బయట ప్రైవేటుపరంగా చూపించుకునే స్తోమత లేక నిరుపేద ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, అలాగే డిజిటల్ ఎక్సరే మిషన్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కావున స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిఎంఎఫ్‌టి నిధులనుంచి హాస్పటల్లో ప్రజలకు అవసరమైనటువంటి మిషన్‌లు కొనేందుకు చొరవ చూపాలని గద్దల రమేష్ కోరారు.

## హత్య కేసులో నిందితుడి అరెస్ట్

పాల్వంచ, ఆగస్టు 30 (జనంసాక్షి) :
హత్య కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తిని పాల్వంచ పట్టణ పోలీస్‌లు శుక్రవారం అరెస్టు చేసి మీడియా ముందు హాజరు పరిచారు. వివరాలు ఇలా ఉన్నాయి. టౌన్ పరిధిలోని శేఖరంబంజరలో ఈనెల 26న బోడ రాందాస్ అనే వ్యక్తి అనుమానాస్పదంగా మృతి చెందగా మృతుడి కూతురు అయిన వాంకుడోత్ ఉమా ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఇట్టి కేసులో శవపంచనామా అనంతరం పోలీసుల దర్యాప్తులో మృతుడి కొడుకుపై అనుమానంతో దర్యాప్తు చేయగా విచారణలో బోడ రాందాష్ మృతికి తన కొడుకు అయిన బోడ చంటియే కారణంగా తెలిసింది, ఇట్టి వ్యక్తిని శేఖరంబంజర లోని నిందితుని ఇంటి వద్ద అదుపులోకి తీసుకొని విచారించగా రాందాష్ నిందితుని భార్యతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని నిందితుడు అయిన బోడ చంటి ఆ విషయం మనసులో పెట్టుకొని తన తండ్రిని గొంతు నులిమి చంపడం జరిగిందని విచారణలో తెలింది. నిందితుడు ని అదుపులోకి తీసుకొని నేడు జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం కోర్ట్ నందు హాజరు పరచడం జరిగిందని ఎస్ఐ సుమన్ తెలిపారు.




## కబ్జాదారుడి చెరనుండి నన్ను కాపాడండి

### నా ఇంటిని నాకు ఇప్పించండి-మీడియాతో గుగులోత్ హరి

పాల్వంచ, ఆగస్టు 30 (జనంసాక్షి) :
కబ్జాదారుడి చెరనుండి నా ఇంటిని, నన్ను కాపాడి నా ఇంటిని నాకు ఇప్పించాలని కోరుతూ పాల్వంచకు చెందిన గుగులోత్ హరి వాపోయాడు. శుక్రవారం స్థానిక ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ నా హక్కులో 1988 నుండి గల స్థలంలో అప్పట్లో ఇందిరమ్మ ఇల్లు నా భార్యపేరన మంజూరి కాగా ఇల్లు ఆ ఇంట్లో చాలాకాలం నివాసం ఉన్నానని అన్నారు. అయితే నా ఆరోగ్యం బాగోక పోవడంతో ఆ ఇంటి నుండి నాబంధువుల (పాండురంగాపురం) వద్ద ఉంటున్నామని తెలిపారు. ఆ సమయంలో నన్ను పరామర్శించడానికి వచ్చిన ఆరుద్ర సత్య నారాయణ, కాసిమ్‌లు నన్ను మెరుగైన వైద్యం చేపిస్తామని చెప్పి హాస్పిటల్ వెళ్ళేందుకు గాను నన్నుప్రలోభపెట్టి ఓ తెల్లకాగితంపై పెట్టించుకునన్నారని అన్నారు. అనంతరం కొంతకాలానికి తాను మా ఇంటికి వెళ్ళిన క్రమంలో ఇంటికి తాళం వేసి ఉండటంతో ఆక్రమణకు గురైనట్లు గుర్తించానన్నారు. ఆక్రమించుకున్న వారు మమ్మల్ని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని, బెదిరిస్తున్నారని కావున ఈ విషయంలో నాకు తగిన న్యాయం చేయాలని మీడియా ముందు గుగులోత్ హరి కోరారు.





## మొక్కలు పెంచడం ప్రతి ఒక్కరు బాధ్యత

ఆళ్లపల్లి ఆగష్టు30( జనంసాక్షి)
మొక్కలు పెంచడం ప్రతి ఒక్కరు బాధ్యత అని ప్రపంచ పర్యావరణ సంస్థ తెలంగాణ స్టేట్ లెవెల్ గ్రీన్ రేంజర్ ఎస్ఎస్ పాషా అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఎంపీపీ ఎస్ పాఠశాలలో లొద్దిగూడెం, బోడాయికుంట గ్రామాలలో వారి ఆధ్వర్యంలో పర్యావరణ ప్రతిజ్ఞ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మొక్కలు పెంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పరిరక్షకులుగా మారాలని తెలిపారు. పర్యావరణ ప్రతిజ్ఞ కార్యక్రమం సహకరించిన పాఠశాల ఉపాధ్యాయులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లొద్దిగూడెం ఉపాధ్యాయులు నాగు ,హెచ్ఎఫ్ రాందాస్ ,బోడాయికుంట ఉపాధ్యాయురాలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సౌకర్యాలు మెరుగుపరచాలి

**చంద్రుగొండ తాజా మాజీ జెడ్పిటిసి కొడకండ్ల వెంకటరెడ్డి**



చంద్రుగొండ, ఆగస్టు 30 (జనంసాక్షి ):
చంద్రుగొండ ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బందిని పెంచి, మందుల కొరత లేకుండా వైద్య సౌకర్యాలను మెరుగుపరచాలని తాజా మాజీ జెడ్పిటిసి కొడకండ్ల వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం చంద్రుగొండ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన గ్రామసభలో ఆయన పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే మండలంలో డెంగ్యూ కేసులు నమోదైనట్లు సమాచారం ఉందని మండలాన్ని హెల్త్ ఎమర్జెన్సీ గా ప్రకటించాలన్నారు. జూలూరుపాడు రోడ్డులో నిర్మించే డ్రైనేజీ నిర్మాణాన్ని ప్రధాన సెంటర్ నుంచి ప్రారంభించాలని నిర్మాణ క్రమంలో నష్టపోయిన ఇంటి యజమానులకు నష్టపరిహారం అందించాలన్నారు. వీధి లైట్ల సమస్యలు, వెలగని హైవే సెంట్రల్ లైటింగ్ వెలిగించేలా చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో, ఎంపీడీవో అశోక్, సెక్రెటరీ జనార్ధన్,గ్రామస్తులు పాల్గొన్నారు.

## భౌతికాయాన్ని సందర్శించి నివాళులర్పించిన కాంగ్రెస్ నాయకులు



కల్లూరు ఆగస్టు 30 (జనం సాక్షి).. కల్లూరు మండలం పుల్లయ్య బంజర్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు పెద్ద బోయిన వెంకీ మాతృమూర్తి సీతారావమ్మ శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏనుగు సత్యంబాబు పలువురు పార్టీ శ్రేణులతో కలిసి పుల్లయ్య బంజర గ్రామం చేరుకొని పెద్ద బోయిన సీతారావమ్మ భౌతికాయాన్ని సందర్శించి పూలమాలతో నివాళులర్పించారు. కుమారుడు పెద్ద బోయిన వెంకీని, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాప సానుభూతి తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు ఏనుగు సత్యం బాబు తో పాటు పసుపులేటి శ్రీనివాసరావు, పొన్నూరు వెంకటేశ్వరరావు, పెద్ద బోయిన నరసింహారావు, కిష్టంశెట్టి ఏడుకొండలు, మాడిశెట్టి శ్రీనివాసరావు, తదితరులుపాల్గొన్నారు.

# ఈ విద్యుత్ వాహనాలు ఆధునిక సైకిళ్ళు..

- మూడు నుంచి ఐదు గంటలు చార్జింగ్ తో 42 కిలోమీటర్ల ప్రయాణం..
- ఆరు మోడల్స్ నో లైసెన్స్ నో రిజిస్ట్రేషన్
- ఎలక్ట్రికల్ బుల్లెట్ త్వరలో అందుబాటులోకి రానుంది..
- తక్కువ ఖర్చుతో ఎక్కువ దూరం ప్రయాణం..











**మణుగూరు, ఆగస్టు 30 (జనంసాక్షి):** ఈ విద్యుత్ వాహనాలు ఆధునిక సైకిల్ లాంటిదని పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు శుక్రవారం మణుగూరు మండలం లోని ఎకో తేజస్ ఈ వి షోరూం ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మణుగూరు మండలంలో ఎన్నో సంవత్సరాలుగా హీరో షోరూం నడుపుతూ అందరి మన్ననలు పొందారు. కాలానుగుణంగా మార్పులు జరుగుతున్న నేపథ్యంలో పెట్రోల్ నుంచి ఎలక్ట్రికల్ వెహికల్ మార్కెట్లోకి వచ్చాయి. రోజురోజుకు పెరుగుతున్న పెట్రోల్ ధరలు దృష్టిలో పెట్టుకొని ఎలక్ట్రికల్ రంగం ముందుకొచ్చింది. దీంతో వినియోగదారులకి ఖర్చు తగ్గుతుంది. గతంలో సైకిల్ వాడారు అదే రీతిలో చార్జింగ్ పెట్టుకుని ఎప్పుడంటే అప్పుడు ఎక్కడికి అంటే అక్కడికి వెళ్లే అవకాశం ఆధునిక సైకిలు (ఎలక్ట్రికల్ వెహికల్) కి ఉంటుందని అన్నారు. ఎలక్ట్రికల్ వెహికల్ వల్ల పర్యావరణం శబ్ద కాలుష్యం లాంటివి రాకుండా ఉంటాయని అన్నారు.ఈ సందర్భంగా షోరూం మేనేజర్ మాట్లాడుతూ... ఎలక్ట్రికల్ ద్విచక్ర వాహనాలలో ఎక్సల్, ఎక్సల్ ప్రో, రికో, ఎరా, ఎరా ప్రో ,ఇవి ఎక్స్ ట్రో, ఫ్రైవ్ మోడల్స్ అందుబాటులో ఉన్నాయన్నారు. రోజుకు మూడు నుంచి ఐదు గంటలు చార్జింగ్ చేస్తే 42 కిలోమీటర్ల ప్రయాణం చేయొచ్చు. వీటి ధర 50 వేల నుంచి రూ 1, 08,000 వరకు ఉంటుంది. ఇందులో ఒక్కొక్క మోడల్ కు ఒక్కొక్క టైప్ బ్యాటరీస్ అమర్చబడి ఉంది. కొన్ని వెహికలకు లిథియం బ్యాటరీ కొన్నింటికి గ్రాఫింగ్ బ్యాటరీలు ఏర్పాటు చేశారు. ఒక వాహనానికి ఐదు బ్యాటరీలు అమర్చారు. ఈ బ్యాటరీ వరుసగా మూడు నుంచి నాలుగు రోజులు వెహికల్ వడకుంటే చార్జింగ్ దిగి పోతుంది అలా దిగిపోకుండా ఆఫ్ ఆన్ స్విచ్ ఏర్పాటు చేశారు. ఈ ఎలక్ట్రికల్ వెహికల్ పై ఒకరు ప్రయాణం చేయొచ్చు ఇద్దరు ప్రయాణం చేయడం వల్ల చార్జింగ్ కొంచెం తగ్గుతుంది.బి డి ఎల్ సి మోటార్ అమర్చబడి ఫ్రంట్ డిస్క్, రేర్ డ్రమ్ము బ్రేక్ కలిగి ఉంటుంది ఫ్రంట్ హైడ్రాలిక్ సస్పెన్షన్స్ కలిగి పూర్తి సెన్సార్ తో వెహికల్ నడుస్తుంది అన్నారు. ఇందులో ఆరు మోడల్స్ లో ఒక్కరు లేదా ఇద్దరు లోకల్ తిరగటానికి సౌకర్యవంతంగా ఉంటుంది. అలాగే ఫ్రైవ్ మోడల్ బైక్ లిథియం బ్యాటరీ, బి ఎల్ డి సి మోటార్ 70 నుంచి 80 కిలోమీటర్లు ప్రయాణం చేయొచ్చు. దీని ధర 1, 23,000 ఉందన్నారు. తక్కువ డౌన్ పేమెంట్ చెల్లించి మిగతాది ఫైనాన్స్ ద్వారా బండి కొనుక్కునే అవకాశం కల్పించారన్నారు. వీటితోపాటు రిక్షా ,ఆటోలు, బుల్లెట్ అందుబాటులోకి తీసుకురానున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు షోరూం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు




## అర్హులైన రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలి

**ఏఐపీకేఎస్ జిల్లా కార్యదర్శి కల్లూరు కిషోర్..**

దమ్మపేట ఆగస్టు 30 (జనం సాక్షి):
దమ్మపేట మండలంలో ఏఐపీకేఎస్ ఆధ్వర్యంలో మండల తాసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి తాసిల్దార్ కు మెమరండం అందజేశారు ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కల్లూరి కిషోర్ సిపిఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి సభ్యులు అమరలపూడి రాములు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అన్నిటిని అమలు చేయాలని షరతులు లేకుండా అర్హులైన రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ చేయాలని రైతు భరోసా పంట బీమా రైతు పథకాలు ప్రభుత్వం ప్రీమియం చెల్లించి అమలు చేయాలని ధరణి సమస్యలను పరిష్కరించి పోడు భూములకు 2006 అటవీ హక్కుల చట్టం ప్రకారం అర్హులందరికీ పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు వ్యవసాయ కార్మికులకు 12 వేల జీవన భృతిని వెంటనే అమలు చేయాలని కోరారు అదేవిధంగా సెప్టెంబర్ రెండో తారీకు కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయం ధర్నాకు రైతులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఏఐపీకేఎస్ మండల కార్యదర్శి పండూరి వీరబాబు,సిపిఐ ఎంఎల్ కురసం ముత్యాలరావు,వాడే గిరి,కేసరి వెంకటేష్,జుంజునూరి నాగరాజు తదితరులు.

## ఇంటింటికి తిరుగుతూ లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

కల్లూరు ఆగస్టు 30(జనం సాక్షి)
అనారోగ్య సమస్యలతో బాధపడుతు పలు హాస్పిటల్ లో వైద్య సేవలు పొందిన లబ్ధిదారులకు ప్రభుత్వం ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరి అయినా ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ ఆదేశాల మేరకు కల్లూరు మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరుగుతూ శుక్రవారం స్వయంగా లబ్ధిదారులకు అందజేశారు. కల్లూరు పట్టణ పరిధిలోని ఎల్లంకి ఎస్టేట్ కాలనీకి చెందిన లక్కినేని లక్ష్మీ శేఖర్కు వైద్య సేవల ఖర్చుల నిమిత్తం సీఎం సహాయ నిధి ద్వారా మంజూరు అయిన 25 వేల రూపాయల చెక్కును మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు భాగం ప్రభాకర్ చౌదరి, బొల్లం రామారావు చేతుల మీదుగా పార్టీ శ్రేణుల సమక్షంలో లబ్ధిదారునికి అందజేశారు.ప్రజలసంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులుభాగం ప్రభాకర్ చౌదరి, బొల్లం రామారావు, పొన్నూరు వెంకటేశ్వరరావు శ్రీ కాశ్మీర్ మహాదేవ క్షేత్రం ఆలయ డైరెక్టర్ ఎనుముల రాము యాదవ్. తోట సుబ్బారావు, పసుపులేటి శ్రీనివాసరావు, ఎస్.కె ఉస్మాన్, షేక్ తురాబ్ అలి, కంభంపాటి పుల్లాచారి, లబ్ధిదారు లక్కినేని శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలని రిలే నిరాహారదీక్షలు




భద్రాచలం, ఆగస్టు 30 (జనం సాక్షి):
ఎస్సీ వర్గీకరణ ను సుప్రీంకోర్టు రద్దు చేయాలని వర్గీకరణ పోరాట సమితి అధ్యక్షుడు అల్లాడి పౌల్ రాజ్ అన్నారు. శుక్రవారం స్థానిక భద్రాచలం అంబేద్కర్ సెంటర్లో సుప్రీం కోర్టు ఇచ్చిన ఎస్సీ వర్గీకరణ తీర్పుకు వ్యతిరేకంగా రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ రాజ్యాధికారం వైపు అడుగులు పడుతున్న నేపథ్యంలో దళితులు ఎక్కడ అధికారం చేపడతారో అని దళితుల ఐక్యత చూసి ఓర్వలేక అధికార వ్యామోహంతో ఉన్న కొన్ని అగ్రకుల మనువాదులు అన్నదమ్ములు గా ఉన్న దళితులను విడదీసి, రెచ్చ గొట్టేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారన్నారు. ముంపు మండలాల ఇంచార్జ్ దేగల వంశీ మాట్లాడుతూ బి ఆర్ అంబేద్కర్ ఈ దేశానికి యిచ్చిన రాజ్యాంగాన్ని మార్చేందుకు, మొత్తం ఎస్సీలకు ఉన్న రిజర్వేషన్ తొలగించే కుట్రలో భాగమే ఈ వర్గీకరణ అని, దీనిని నా దళిత ప్రజానీకం గమనించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వర్గీకరణ పోరాట సమితి నాయకులు శివ, సరేళ్ళ వెంకటేష్, శ్రీను , సందీప్, వెంకన్న , రాఘవులు, రామకృష్ణ, కార్తీక్, సత్తిబాబు, సురేష్, వెంకటేశ్వర్లు, ఉప్పెర్ల వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.



# చిరువ్యాపారులకు రోటరీ చేయూత నివ్వడం అభినందనీయం

## భద్రాచలం ఏ.ఎస్పి అంకిత్ కుమార్ సంఖ్వార్

భద్రాచలం, ఆగస్టు 30 (జనం సాక్షి):
జీవనోపాధి కోసం రోడ్డుపై కూరగాయలు, పండ్లు, టిఫిన్ అమ్ముకుని జీవనం సాగించే లబ్ధిదారులైననక్క సుబ్రమణ్యం, ఇనుముల ప్రవీణ్, షేక్ గౌస్య, మణి తదితర చిరువ్యాపారులకు రూ.60 వేల విలువ గల తోపుడు బండ్లను, చార్జబుల్ దీపాలను అందించి రోటరీ చేయూతనివ్వడం అభినందనీయం అని భద్రాచలం ఏ యస్ పీ అంకిత్ కుమార్ సంఖ్వార్ అన్నారు. శుక్రవారం స్థానిక అన్నపూర్ణ ఫంక్షన్ లో రోటరీ క్లబ్ ఆఫ్ రివర్సైడ్ అధ్యక్షులు డాక్టర్ రమేష్ బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏఎస్పీ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో రోటరీ సేవలు విస్తరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇరు తెలుగు రాష్ట్రాల తాజా మాజీ గవర్నరు డాక్టర్ బూసిరెడ్డి శంకర్ రెడ్డి, భద్రాచలం గ్రామ పంచాయతీ కార్యదర్శి చెరుకుమిల్లి శ్రీనివాసరావు, ప్రోగ్రాం చైర్మన్ రొటేరియన్ ధనికొండ రాఘవయ్య, కార్యదర్శి రొటేరియన్ గంజి సంపత్ లతో పాటు, ఏయస్పీ చేతులమీదుగా రోటరీ క్లబ్ ఆఫ్ రివర్ సైడ్లో నూతన సభ్యులుగా చేరిన బొలిశెట్టి రంగారావు, రిటైర్డ్ ఈఈ ప్రభాకర్, నాగేశ్వర రావు, తదితరులు పాల్గొన్నారు.

# బోనకల్ లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



బోనకల్, ఆగస్టు 30( జనంసాక్షి):
బోనకల్ మండల కేంద్రంలో గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామపంచాయతీ కార్యదర్శి దామల్ల కిరణ్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ సిబ్బంది ,అంగన్వాడీలు, ఆశా లు , ఐకెపి సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు టీమ్ గా ఏర్పడి ఇంటింటికి తిరుగుతూ సీజనల్ వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నందున వైద్య సిబ్బంది సహకారంతో శుక్రవారం ఫ్రైడే డ్రై డే లో భాగంగా ప్రభుత్వ విద్యాలయాలు ,గురుకుల పాఠశాలలు, శాంతి నిలయం మొదలగు ఎక్కువ జనావాస ప్రాంతాలలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ప్రత్యేకంగా పేర్థియం ద్రావణాన్ని పిచికారి చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటిలోపల, పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. పగటిపూట మాత్రమే కుట్టే ఎడిస్ ఈజిప్ట్ దోమ వల్ల డెంగ్యూ వ్యాధి వస్తుందని, ఈ దోమ మంచినీటి నిల్వల్లో వృద్ధిచెందుతుందని అన్నారు. పాత టైర్లు, మురుగు కాల్వలు, కొబ్బరిచిప్పలు, ఎయిర్ కూలర్లు, డ్రమ్ములు, బకెట్లు, బిందెల్లో ఎక్కువ రోజులు నీటిని నిల్వ ఉంచడం వల్ల అందులో లార్వా పెరిగి దోమలు వ్యాప్తి చెందుతాయన్నారు. వర్షాలు పడుతున్నందున దోమలు పెరిగి, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. దోమల నియంత్రణతో వ్యాధులు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టవచ్చని ఆయన అన్నారు. వర్షాకాలం కావడంతో దోమల వృద్ధితో డెంగీ, మలేరియాకి గురవుతారని అన్నారు. టైర్ షాపులు, పాత ఇనుప సామానుల షాపులు, ఆటోమొబైల్, పంక్చర్, కూల్ డ్రింక్స్ తదితర షాపుల పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు చేపట్టాలని, పరిశుభ్రత పాటించాలని అన్నారు. నీటి నిల్వలు లేకుండా చూడడం, ఇల్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికి తిరుగుతూ మొక్కల కుండీలు, కూలర్లలో, ఉపయోగంలో లేని వస్తువులలో నీటి నిల్వలను తొలగించి, తేమోపాస్ ద్రావణం పిచికారీ చేయించారు.పారిశుద్ధ్య చర్యలు పకడ్బందీగా చేపడుతున్నట్లు గ్రామ కార్యదర్శి కిరణ్ తెలిపారు. బ్లీచింగ్ పౌడర్ చల్లడం, ఫినాయిల్, మలాథీన్లతో స్ప్రే తో పాటుగా ఫాగింగ్ చేయడం జరుగుతుందన్నారు. పరిశుభ్రతను ప్రతిఒక్కరూ బాధ్యతగా గుర్తెరిగి నడవాలన్నారు. అదేవిధంగా సిబ్బందితో టీములను ఏర్పాటు చేసి పకడ్బందీగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి కిరణ్, పిహెచ్సి సిహెచ్ఓ శ్రీనివాసరావు, ఏఎన్ఎం సరస్వతి, అంగన్వాడీ టీచర్లు రమాదేవి ,శిరీష, ఆశా కార్యకర్తలు లీల ,విజయ ,దుర్గ, తులసి, ఐకెపి సిబ్బంది పద్మ రేణుక, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయిలో నవోదయ మోడల్ పరీక్ష..

## ◆ బ్రిలియంట్ నవోదయ కోచింగ్ చైర్మన్ బి.ఎన్.ఆర్..



బూర్గంపహాడ్ ఆగష్టు 30 (జనంసాక్షి)
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం సారపాక బ్రిలియంట్ నవోదయ కోచింగ్ వారి ఆధ్వర్యంలో గత 19 సంవత్సరాల నుండి ప్రతి సంవత్సరం నవోదయ లో సీట్లు అత్యధికంగా సాధిస్తున్నారు. ఈ సంవత్సరం కూడా 2024-2025 సంవత్సరంలో జరగబోయే నవోదయ మెయిన్ పరీక్ష వ్రాయ బోవు విద్యార్థులకు పరీక్ష పై అవగాహన కల్పించుటకు ఈ నవోదయ మోడల్ పరీక్షను సారపాక బ్రిలియంట్ నవోదయ కోచింగ్ వారు 2024 సెప్టెంబర్ ఒకటవ తారీఖు ఆదివారం ఉదయం 9:30 ని: లకు బ్రిలియంట్ స్కూల్ %ఁ% కాలేజ్ నందు నిర్వహించనున్నట్లు బ్రిలియంట్ నవోదయ కోచింగ్ చైర్మన్ బి.ఎన్.ఆర్ ఒక ప్రకటనలో తెలియజేసారు. మెంటల్ ఎబిలిటీ, మాథ్స్, లాంగ్వేజ్ పై ఈ మోడల్ పరీక్ష ఉంటుందని ఈ అవకాశాన్ని ప్రైవేట్, గవర్నమెంట్ స్కూల్ ల లో 5 వ తరగతి చదువుతున్న తెలుగు, ఇంగ్లీష్ మీడియం విద్యార్థినీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని, ఈ పరీక్షలో మొదటి రెండు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఉచితంగా కోచింగ్ ఇవ్వనున్నట్లు బి.ఎన్. ఆర్ తెలియజేశారు. నవోదయ మోడల్ పరీక్ష వ్రాయ బోవు విద్యార్థులు ఒక్కరోజు ముందుగా తమ పేర్లను బ్రిలియంట్ స్కూల్ నందు నమోదు చేసుకోగలరని, పూర్తి వివరాలకు బ్రిలియంట్ స్కూల్ సారపాక సెల్:9866283566, 7675040619 నంబర్లను సంప్రదించగలరని తెలియజేశారు.

# గిరిజన విద్యార్థులకు "ఐటీసీ" చేయూత

## ఐఐటి, నీట్, స్పోర్ట్స్ లో రాణించిన ఒక్కొక్కరికి రూ. 25 వేల చెక్కులు అందించిన ఐటీడీఏ పీఓ




భద్రాచలం ఆగస్టు 30 (జనం సాక్షి):
భద్రాచలం గిరిజన గురుకులంలో చదివి ఐఐటి, నీట్, ఐజర్ సీట్స్ సాధించి, క్రీడల్లో రాణిస్తున్న పూర్వ, ప్రస్తుత మొత్తం పదిమంది బాలికలకు భద్రాచలం ఐ.టి.సి. పి.ఎస్.పి.డి ఆర్థిక చేయూతను అందించింది. ఒక్కొక్కరికి రూ. 25 వేలు చొప్పున చెక్కులను శుక్రవారం ఐటిడిఏ పి.ఓ, బి.రాహుల్ చేతుల మీదుగా బాలికలకు వారి తల్లిదండ్రుల సమక్షంలో అందజేశారు. గిరిజన గురుకుల కళాశాల ప్రాంగణంలో జరిగిన ఈ వేడుకలో ఐటీసీ పీ.ఎస్.పీడీ హెచ్ఆర్ మేనేజర్ డి. చంగల్ రావు మాట్లాడుతూ ఐటీసీ తరపున చదువులో రాణిస్తున్న పిల్లలను ప్రోత్సహించేందుకు ఇటువంటి ఆర్థిక సహకారాన్ని అందజేస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గిరిజన గురుకులాల ప్రాంతీయ సమన్వయ అధికారి శ్రీ కే నాగార్జున రావు, ప్రిన్సిపాల్ ఏ.పద్మావతి, గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఎస్ రమాదేవి,, ఐటిసి మహిళా సమితి వైస్ ప్రెసిడెంట్ రేష్మ ప్రణవ శర్మ , సెక్రటరీ ఆల్క ప్రఫుల్ల, కళాశాల హిస్టరీ లెక్చరర్ తోటమల్ల బాలయోగి తదితరులు పాల్గొన్నారు.

## రుణమాఫీ విషయంలో అపోహలు వద్దు

### ◆ ఎడిఎ నరసింహారావు

పాల్వంచ, ఆగస్టు 30 (జనంసాక్షి) :
ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ విషయంలో రైతులు ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దని ఎడిఎ నర్సింహారావు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కోడిపుంజులవాగు వద్ద ఏర్పాటు చేసిన రైతురుణమాఫీ కేంద్రానిక్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భార్యాభర్తలిద్దరూ బ్యాంకుల నుండి రైతు రుణం పొందితే ఇద్దరి రుణాలను కలిపిన మొత్తాన్ని పరిగణలోకి తీసుకుంటామన్నారు. రూ.2 లక్షల రుణం దాటితే, ప్రభుత్వ విధివిధానాలను అనుసరించి వ్యవసాయ శాఖ చర్యలు చేపడుతుందన్నారు. పెండ్లి కాని వారి రుణమాఫీ అంశంలో ప్రభుత్వ నిబంధనలననుసరించి చర్యలకు ఉపక్రమిస్తామన్నారు. భార్యాభర్తల్లో ఒకరు చనిపోతే రుణమాఫీలో కొంత సాంకేతిక ఇబ్బందులు తలెత్తుతున్నాయని చెప్పారు. త్వరలో ఈ సమస్యను అధిగమిస్తామన్నారు. ఏర్పాటుచేసిన కేంద్రాలలో కుటుంబ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డ్, ఆధార్ కార్డులను సమర్పించాలని సూచించారు. పాల్వంచ వ్యాప్తంగా 711 మందిని గుర్తించామని, ఇప్పటివరకు 82 మంది రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించి, అప్లోడ్ చేసినట్లు చెప్పారు. కొత్తగూడెం ఏ డి ఏ



పరిధి పాల్వంచ, కొత్తగూడెం, చుంచుపల్లి, జూలూరుపాడు, సుజాతనగర్ మండలాల్లో 2500 మంది రైతులకు రుణమాఫీ లో సాంకేతిక సమస్యలు గుర్తించినట్లు పేర్కొన్నారు. వాటిని అధిగమించే దిశగా వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యామ్నాయ చర్యల్లో నిమగ్నమైనట్లు తెలిపారు. రైతుల పక్షాన ఏ ఇబ్బంది తలెత్తినా పరిష్కారానికి వ్యవసాయ శాఖ ఎల్లవేళలా సిద్ధమని స్పష్టం చేశారు. సెప్టెంబర్ 2,3,4 తేదీల్లో పాల్వంచ వ్యవసాయశాఖ కార్యాలయంలో అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ శంభోశంకర్, తదితరులు పాల్గొన్నారు.



## మానవత్వం చాటుకున్న చల్లా లక్ష్మీకాంత్

### దొరికిన 35వేల నగదును పోగొట్టుకున్న వ్యక్తికి అప్పగింత

సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):
జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖులు చల్ల లక్ష్మీకాంత్ మానవత్వాన్ని చాటుకున్నారు.తనకు రోడ్డు పక్కన దొరికిన 35 వేల రూపాయల నగదును పోగొట్టుకున్న రాజేష్ అనే వ్యక్తికి అందజేశారు.శుక్రవారం చల్లా లక్ష్మీకాంత్ జిల్లా కేంద్రంలోని నల్లాల బావి రోడ్డులోని తన ఆఫీసుకు వెళు ్తండగా ఆ దారిలో రోడ్డు పక్కన రూ.35 వేలు నగదు దొరికింది.నగదుతో పాటు బ్యాంక్ వోచర్ లో ఫోన్ నంబర్ ఉండటంతో ఆ నంబరుకు ఫోన్ చేయగా రాజేష్ అనే వ్యక్తి వచ్చి డబ్బు తనదేనని, బ్యాంకులో జమ చేయడానికి వెళ్తుంటే దారిలో తన గుమస్తా జేబు నుండి జారీ పడి పోయినట్లు తెలిపారు.తన గుమస్తా తన వద్దకు వచ్చి డబ్బు పోయిందని ఏడుస్తూ చెప్పుతుండగా అంతలోనే డబ్బు దొరికిందని లక్ష్మీకాంత్ ఫోన్ చేశారని సంతోషం వ్యక్తం చేశారు.తనకు దొరికిన నగదును రాజేష్ కు చల్లా లక్ష్మీకాంత్ అందజేశారు.తాను పోగొట్టుకున్న డబ్బు తిరిగి దొరకడంతో రాజేష్ సంతోషం వ్యక్తం చేసి చల్లా లక్ష్మీకాంత్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా చల్లా లక్ష్మీకాంత్ ను పలువురు అభినందించారు.




## పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులను ఘనంగా సత్కరించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవర్

నల్గొండటౌన్, ఆగష్టు 30(జనంసాక్షి)
పోలీస్ శాఖలో విధులు నిర్వర్తిస్తూ పదవీ విరమణ పొందిన హెడ్ కానిస్టేబుల్స్ బసవయ్య, రంజిత్ సింగ్, మరియు పాలన విభాగంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ మహబూబ్ అలీ ను జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పి ఘనంగా సత్కరించి వారి చేసిన సేవలను కొనియాడారు.ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా పోలీస్ శాఖలో పనిచేస్తూ ప్రజలకు సేవలు అందించి పూర్తి ఆరోగ్యంతో నేడు పదవి విరమణ పొందడం అభినందనీయం అన్నారు. తమ శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా గడపాలని తెలిపారు. భవిష్యత్తులో ఏ విధమైన సమస్యలు తలెత్తినా వెంటనే తమను సంప్రదించాలని వారికి తెలియజేశారు అనంతరం పదవీ విరమణ పొందిన పోలీసు అధికారుల కుటుంబాల ప్రస్తుత స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. పదవీ విరమణ అనంతరం ప్రభుత్వం నుంచి వారికి చెందాల్సిన అన్ని రకాల బెనిఫిట్స్ త్వరితగతిన అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాములు నాయక్, ఎస్బి డిఎస్పీ రమేష్,ఏ.ఓ శ్రీనివాస్,జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు జయరాజు, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి ఒక్కరు క్రీడలను ప్రోత్సహించాలి మున్సిపల్ చైర్మన్ ప్రకాష్..

నేరేడుచర్ల( జనంసాక్షి):
స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నేరేడుచర్ల, పాలకవీడు, మండలాల ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మండల స్థాయి క్రీడలను నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసాన్ని కలిగించడమే కాక వ్యక్తిగత క్రమశిక్షణ, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని విద్యార్థులు క్రీడల్లో రాణించి జాతీయ అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని ప్రతి ఒక్కరూ క్రీడలను ప్రోత్సహించాలని కోరారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఏ.అశోక్ రెడ్డి, మండల విద్యాధికారి చిత్ర నాయక్,స్థానిక బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, నేరేడుచర్ల హై స్కూల్ హెచ్ఎం బట్టు మధు, పెంచికల్ దిన్న హెచ్ఎం .ఎల్ శ్రీనివాసరావు,పాలకవీడు హైస్కూల్ హెచ్ఎం ఇంజమూరి కాటయ్య, జానపహాడ్ హైస్కూల్ హెచ్ఎం .లింగయ్య, మరియానంద స్కూల్ కరస్పాండెంట్ పి.లూకాస్, ఎస్జీఎఫ్ మండల కార్యదర్శి పిడి ఎం యాదగిరి,ఏసుపాదం,శ్రీనివాస్, భాస్కర్, కవిత,ఉపాధ్యాయులు శ్రీరామ్ రెడ్డి, సైదులు, తదితరులు పాల్గొన్నారు.



### పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయునికి సన్మానం

రామన్నపేట, ఆగస్టు 30 (జనంసాక్షి) :
మండలంలోని వెల్లంకి గ్రామానికి చెందిన మోటే సత్తయ్య స్కూల్ అసిస్టెంట్ (తంగేడు పెల్లి) పదవి విరమణ పొందారు. ఈ కార్యక్రమానికి వెల్లంకి మాజీ సర్పంచ్ ఎడ్ల మహేందర్ రెడ్డి, బిజెపి జిల్లా నాయకులు మదూరి ప్రభాకర్ రావు లు పాల్గొని సత్తయ్య ను శాలువా, పూలమాలవేసి ఘనంగా సత్కరించారు.

# విద్యారంగా సమస్యలను పరిష్కరించాలి : ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి

నల్గొండ టౌన్, ఆగష్టు 30(జనంసాక్షి)
అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ నల్లగొండ శాఖ ఆధ్వర్యంలో స్టేషన్ హోటల్లో ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం యావత్ తెలంగాణ రాష్ట్ర విద్యార్థిని ఉద్యోగులు ముందుండి అనేక ఉద్యమాలు చేసి నిస్వార్థంగా ప్రాణాలర్పించి స్వరాష్ట్రం సాధించుకుంటే నాడు ఆశించిన విధంగా తెలంగాణ రాష్ట్రం వస్తే విద్యారంగం బాగుపడుతుంది ఉద్యోగాలు వస్తాయని ఆశించిన విద్యార్థి నిరుద్యోగులకు నిరాశ మిగిల్చింది బీఆర్ఎస్ ప్రభుత్వం గడిచిన 10 సంవత్సరాలు ప్రాథమిక పాఠశాలల నుండి ఉద్యమ కేంద్రం విశ్వవిద్యాలయాల వరకు విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తూ నిరుద్యోగులకు తీరని అన్యాయం చేసింది టీఆర్ఎస్ ప్రభుత్వం. ఉద్యోగాలు లేక ఇదిగో నోటిఫికేషన్లు అదిగో నోటిఫికేషన్లు అంటూ నిరుద్యోగ యువతకు ఆశ చూపుతూ సంవత్సరాలు తరబడి వీళ్ళకు వేలు కోచింగ్ సెంటర్లలో ఫీజులు కడుతూ ఒక పూట పస్తులుండి ఉద్యోగాల కోసం కష్టపడిన నిరుద్యోగ యువతకు తీరా ఎలక్షన్ల ముందు కడప తడప నోటిఫికేషన్లో వేసి ఆ నోటిఫికేషన్ అయినా సక్రమంగా నిర్వహించి నియామకాలు చేపడతారు అనుకుంటే పరీక్ష రద్దులు పేపర్ లీకేజీలతో కోర్టు మెట్ల చుట్టూ తిప్పుతూ నిరుద్యోగ యువత బ్రతుకుని రోడ్డుకి ఈడ్చింది టీఆర్ఎస్ ప్రభుత్వం. టీఆర్ఎస్ ప్రభుత్వం యొక్క ఆగడాలను ఎండ కట్టడానికే ఆ ప్రభుత్వానికి హెచ్చరికగా అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ కథన బేరి అనే కార్యక్రమంతో లక్ష మంది విద్యార్థులతో కలిసి గత ఏడాది ఆగస్టు ఒకటో తేదీన గత రాష్ట్ర ప్రభుత్వానికి సవాల్ విసురులతో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన తర్వాతే ఎలక్షన్లకు వెళ్లాలని లేకపోతే ఓటమిని చవిచూడాల్సి వస్తుందని ఓపెన్ చాలెంజ్ లెటర్ డిక్లేర్ చేసిన, పెదవెవిన పెట్టనటువంటి బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఏబీవీపీ అధికార మదాన్ని దించడానికి యావత్ విద్యార్థి నిరుద్యోగ యువతను చైతన్యవంతం చేస్తూ బిఆర్ఎస్ ప్రభుత్వం గద్దెదించడంలో ముఖ్యపాత్ర పోషించిందని అన్నారు. విద్యార్థిని నిరుద్యోగ యువత తమకు జరిగిన అన్యాయాలు పోయి న్యాయం జరగాలని ఆశించి నూతన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎంచుకొని ఈ ప్రభుత్వంలో అయినా న్యాయం జరుగుతుందని ఆశిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే పోకడలో విద్యార్థి నిరుద్యోగ యువతకు అన్యాయం చేస్తుందని అన్నారు. స్వయంగా ముఖ్యమంత్రి పర్యవేక్షణలో ఉన్న విద్యాశాఖ బాగుపడుతుందని ఆశిస్తే ఆశలన్నీ కూడా అడియాశగా మారాయి అని ప్రభుత్వం ఇకపైన




అయినా విద్యారంగంపై నిర్లక్ష్యం విడనాడి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని లేనియెడల అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ విద్యా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న ఈ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల పక్షాన పోరాడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నల్లగొండ విభాగ్ కన్వీనర్ సుర్వి మణికంఠ, స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ జూపల్లి దీపిక, జిల్లా కన్వీనర్ ఆవుల సంపత్, నగర కార్యదర్శి శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

హుజూర్ నగర్, ఆగస్టు 30 (జనంసాక్షి):

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఒక గొప్ప వరం అని హుజూర్ నగర్ మున్సిపల్ చైర్ పర్సన్ గెల్లి అర్చనరవి, వైస్ చైర్మన్ కోతిసంపత్ రెడ్డి లు అన్నారు. శుక్రవారం పట్టణంలోని 25వ వార్డులో మంజూరు అయిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ లను మంత్రి క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులైన బుడిగ భారతమ్మ, దగ్గుపాటి రాణి, గడ్డం ఉమా లకు, మున్సిపల్ చైర్ పర్సన్ గెల్లి అర్చన రవి, వైస్ చైర్మన్ కోతిసంపత్ రెడ్డి, 4 వార్డ్ కౌన్సిలర్ ఓరుగంటి. నాగేశ్వరావు, 25వ వార్డు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ సులువ చంద్ర శేఖర్ చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఒకేసారి రైతులకు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందని, రుణమాఫీ కాని వారు ఎటువంటి ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని, తప్పనిసరిగా రుణమాఫీ జరుగుతుందని, రుణమాఫీ ఒకేసారి చేస్తే



తట్టుకోలేని ప్రతిపక్షాలు లేనిపోని నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నాయని, కొత్త రేషన్ కార్డులను త్వరలోనే ఇవ్వనున్నట్లు, సెప్టెంబర్ 17 నుండి పది రోజులపాటు ప్రజల వద్ద నుండి రేషన్ కార్డు, హెల్త్ కార్డు కొరకు ప్రజా పాలన నిర్వహించుచున్నామని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.



# సమస్యల పరిష్కారంలో ప్రజలకు తోడుగా నిలబడాలి

సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):

ప్రతి తెలంగాణ జన సమితి కార్యకర్త ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజలకు తోడుగా ఉంటూ ప్రభుత్వం ద్వారా రావాల్సిన అన్ని సంక్షేమ పథకాలు అందేట్లుగా చూడాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్ పిలుపునిచ్చారు. శుక్రవారం సూర్యాపేట పట్టణ పార్టీ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సాధించుకున్న తెలంగాణలో కేసీఆర్ అనుసరించిన ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగట్టి ఓడించడంలో క్రియాశీలక పాత్ర పోషించినటువంటి పార్టీ శ్రేణులు నేడు జన సమితి పార్టీ మద్దతు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం చేపట్టే ప్రతి సంక్షేమ పథకం ప్రతి లబ్ధిదారునికి చేర్చే విధంగా ప్రయత్నం చేయాలని కార్యకర్తలను కోరారు. రాష్ట్ర పార్టీ నిర్ణయం మేరకు సెప్టెంబర్ 1 నుండి 25 లోపు నియోజకవర్గంలో పెద్ద ఎత్తున సభ్యత్వ కార్యక్రమాన్ని చేపట్టి బలమైన పార్టి నిర్మాణానికి కృషి చేయాలన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమం పరిశీలనకు నియోజకవర్గస్థాయిలో ఐదుగురు సభ్యులతో సబ్ కమిటీని ప్రకటించారు. జిల్లా పార్టీ అధ్యక్షులు గట్ల రమాశంకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో యువజన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు, రైతు జన సమితి జిల్లా అధ్యక్షులు పానుగోటి సూర్యనారాయణ, పార్టీ మండలాల అధ్యక్షులు కొల్లు కృష్ణారెడ్డి, సుమన్ నాయక్, పలికి రాజు, ఎస్సీ సెల్ జిల్లా కన్వీనర్ గోపి, లీగల్ సెల్ నాయకులు శ్రీనివాస్, సతీష్, విద్యార్థి జన సమితి జిల్లా అధ్యక్షులు బొమ్మగాని వినయ్ గౌడ్, పట్టణ మైనార్టీ సెల్ కన్వీనర్ ఫరీరుద్దీన్, ఎస్టీ సెల్ జిల్లా కార్యదర్శి మల్సూర్ నాయక్ , శ్రీను నాయక్, మదుసూధన్ రెడ్డి, గోపి, యాకూబ్ రెడ్డి, జగన్ తదితరులు పాల్గొన్నారు.



# విష జ్వరాల భారీ నుండి ప్రజా ఆరోగ్యాన్ని రక్షించాలి

**- సిపిఎం మండల కార్యదర్శి పోసన బోయిన హుస్సేన్**

హుజూర్ నగర్, ఆగస్టు 30 (జనంసాక్షి):

అంటు వ్యాధులు, విష జ్వరాల భారీ నుండి ప్రజా ఆరోగ్యాన్ని రక్షించాలని, ప్రజలు రోగాల బారిన పడుతున్న వాటి నివారణకు చర్యలు తీసుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం గోరంగా వైఫల్యం చెందిందని సిపిఎం మండల కార్యదర్శి పోసన బోయిన హుస్సేన్ విమర్శించారు. శుక్రవారం మండల పరిధిలోని అమరవరం గ్రామంలో విష జ్వరాలు సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకుని ఆ గ్రామంలో నిరసన తెలియజేశారు. మండల వ్యాప్తంగా అంటూ వ్యాధులు, విష జ్వరాల భారీ నుండి ప్రజా ఆరోగ్యాన్ని రక్షించాలని డిమాండ్ చేశారు. గత రెండు, మూడు నెలలుగా మండల వ్యాప్తంగా విస్తారంగ కురిసిన వర్షాల వలన ప్రజలు టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా వంటి వ్యాధులతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండల వ్యాప్తంగా ప్రజలు విష జ్వరాల బారిన పడి ఇబ్బందులు పడుతుంటే వాటిని పరిష్కరించవలసిన డాక్టర్లు, అధికారులు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అన్ని గ్రామాలకు పారిశుద్ధ్య నిధులు కేటాయించి వ్యాధులు ప్రభలంకుండా ప్రతిష్ట చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శాఖ కార్యదర్శి షేక్ ఖాసిం, షేక్ సైదా, సీతారాములు, గోవిందు, పున్నయ్య ,మహేష్, సౌభాగ్యము, వెంకన్న , బాల సైదులు తదితరులు పాల్గొన్నారు.

## పుల్లారావును సన్మానించిన స్నేహితులు

పెన్ పహాడ్ ఆగస్ట్ 30 (జనం సాక్షి) :

మండల పరిధిలోని లింగాల గ్రామానికి చెందిన సీనియర్ పాత్రికేయులు చలిగంటి పుల్లారావు ఇటీవల తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టీ డబ్ల్యూ జె ఎఫ్) రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఎన్నిక కాగా తన స్నేహితులు గురువారం రాత్రి ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాత్రికేయ వృత్తిలో పుల్లారావు ఇంకా ఉన్నత స్థానాలను ఎదగాలని ఆకాంక్షించారు అనంతరం శాలువాతో సన్మానించారు ఈ కార్యక్రమంలో తిప్పిరి శెట్టి వెంకన్న, మామిడి బ్రహ్మం, రాయిరాల వంశి, మామిడి శ్రీధర్, మల్లెపల్లి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు...



## పురుగుల మందు తాగి ట్రైనింగ్ కానిస్టేబుల్ మృతి..

చింతపల్లి, ఆగస్టు 30(జనం సాక్షి)





మతి స్థితి సరిగా లేక,మనస్థాపానికి గురై పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ ట్రైనింగ్ కానిస్టేబుల్ మృతి చెందిన సంఘటన చింతపల్లి మండల కేంద్రంలో శుక్రవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చింతపల్లి గ్రామానికి పాలకుర్ల సత్తయ్య కుమారుడు పాలకుర్ల ఆంజనేయులు హైదరాబాద్ గోషామాల్ ట్రైనింగ్ సెంటర్ లో ట్రైనింగ్ తీసుకుంటూ, సెలవులో భాగంగా ఈనెల 25వ తారీకు చింతపల్లి గ్రామానికి వచ్చాడని, ఈనెల 28వ తేదీ నాడు ఉదయం వ్యవసాయ పొలం వద్ద స్నానం చేయడానికి వెళ్లి తిరిగి రానందున కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా పురుగుల మందు తాగి ఉండటాన్ని గమనించిన చికిత్స నిమిత్తం హైదరాబాదులో బంజారాహిల్స్ ఓ ఆసుపత్రిలో అడ్మిట్ చేసారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడని, కొద్ది రోజుల నుండి పాలకుర్ల ఆంజనేయులు యొక్క మతిస్థితి సరిగా లేదన్న తనకు గుబులు గుబులుగా ఉంది అంటూ చనిపోతానని అతని కుటుంబ సభ్యులకు అంటు ఉండేవాడని, అతని మరణం పట్ల ఎవరికి ఎటువంటి అనుమానం లేదని, మతిస్థిమితం సరిగా లేనందున పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని, తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు చింతపల్లి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ యాదయ్య తెలిపారు.

# టీఎస్ యుటిఎఫ్ నూతన మర్రిగూడ మండల కమిటీ ఎన్నిక

**మండల అధ్యక్షులు గా మహేశ్వరం వెంకటేశ్వర్లు**
**ప్రధాన కార్యదర్శిగా పున్నకృష్ణయ్య**



పున్న కృష్ణయ్య TSUTF మర్రిగూడ మండల ప్రధాన కార్యదర్శి

మర్రిగూడ, ఆగస్టు 30, (జనంసాక్షి):

2024-2025విద్యా సంవత్సరం కు ఎన్నికల అధికారి గా నల్ల నరసింహ, ఎన్నికల పరిశీలకులు గా కాశిరెడ్డి కృష్ణారెడ్డి సమక్షం లో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మండల అధ్యక్షులు గా మహేశ్వరం వెంకటేశ్వర్లు , ప్రధాన కార్యదర్శిగా పున్నకృష్ణయ్య, ఉపాధ్యక్షులుగా నాగవ రం శ్రీనివాసరావు, మహిళా ఉపాధ్యక్షురాలు గా పోతుగంటి స్వప్న, కోశా ధికారిగా బండారు గోవర్ధన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మర్రిగూడ మండలం నుండి ఇతర మండలాలకు బదిలీ, పదోన్నతి, పై వెళ్లిన కుటుంబ సంక్షేమనిధి సభ్యులకు మెమెంటో,శాలువా తో ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ సీనియర్ నాయకులు జి.బుచ్చయ్య, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు,జిల్లా కార్యదర్శి కె.యాదగిరి , కొండమల్లేపల్లి మం డల అధ్యక్షులు జి.శ్రీరాములు, చింతపల్లి మండల అధ్యక్షులు జి. సత్య నారాయణ , జిల్లా ప్రతినిధి పరంగి,దీవంత, బద్దెలకృష్ణయ్య, ఉపేందర్, వెంకటేష్,వేణు ,పరంగి, బత్తుల యాదయ్య, సులేమాన్ ,శ్రవణ్ కుమార్, మంజుశ్రీ,నిర్మల, నవనీత ,నాగమణి, , హన్మంతు, సుజాత, వసిమున్నిసా, తదితరులు పాల్గొన్నారు.



మహేశ్వరం వెంకటేశ్వర్లు TSUTF మర్రిగూడ మండల అధ్యక్షులు

# దుబాయ్ లో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభకు ఏర్పాట్లు

సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):



ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్యలను ఏకం చేయుటకు సెప్టెంబర్ 15న దుబాయిలోని అబుదాబిలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్లోబల్ సమ్మిట్ ను నిర్వహిస్తున్నట్లు ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ మీడియా కమిటీ చైర్మన్ కౌటికే విటల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియాలో ప్రపంచ ఆర్యవైశ్య మహాసభకు 20 రాష్ట్రాలలో విభాగాలు ఉన్నాయని, కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు విస్తరించి సమాజ సేవలో సేవలందిస్తుందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 55 దేశాలలో విభాగాలు పనిచేస్తున్నాయని, ఆర్యవైశ్యులను ఒకే వేదిక పైకి తీసుకువచ్చి పెద్ద ఎత్తున మహాసభ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సుమారు 20 దేశాల నుండి ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొని ఎన్నో తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలో భారతదేశం ఔనత్యాన్ని చాటి చెప్పే విధంగా సాంస్కృతిక కార్యక్రమాలు, బిజినెస్ మీట్ తో పాటు వివాహ పరిచయ వేదికను కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభ అధ్యక్షులు టంగుటూరి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పారిశ్రామిక శాఖ మంత్రి టీజీ భరత్ తో పాటు సినీ ప్రముఖులు, సెలబ్రిటీస్ పాల్గొననున్నట్లు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఆర్యవైశ్యులందరూ ఒకే చోట కలుసుకొనే అవకాశాన్ని ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ కల్పిస్తున్నందున ఈ అవకాశాన్ని ఆర్యవైశ్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# విద్యుత్ షాక్ తో విద్యార్థినీలకు తీవ్ర అస్వస్థత..

## త్రుటిలో తప్పిన ప్రమాదం..

తుంగతుర్తి ఆగస్టు 30 (జనం సాక్షి)
విద్యుత్ షాక్ గురై గిరిజన గురుకుల బాలికలు తీవ్ర అస్వస్థతతో ప్రభుత్వ ఆసుపత్రిలో చేరిన సంఘటన మండల కేంద్రంలో శుక్రవారం చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న సాయి లహరి మరియు ఐదవ తరగతి చదువుతున్న సాయి ప్రసన్నలు మధ్యాహ్నం వాష్ రూమ్ కి వెళ్లారు. ఈ క్రమంలో వాష్ రూమ్ కి ఉన్న ఇనుప డోర్ కు విద్యుత్ వైరు ఫెయిల్ అయి తగలడంతో విద్యుత్తు ప్రసారమైంది. విషయం తెలియని బాలికలు డోరు ను ముట్టుకోగానే ఇద్దరికీ విద్యుత్ షాక్ తగిలింది. దీంతో అక్కడే ఉన్న కరెంటు మెకానిక్ తో పాటు పలువురు హుటా హుటున వెళ్లి వారిని రక్షించారు. దీంతో వారికి పెను ప్రమాదం తప్పింది. వెంటనే వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వీరు ఇరువురు మండల పరిధిలోని దేవుని గుట్ట తండాకు చెందినవారు. ప్రస్తుతానికి వారికి ఎలాంటి ప్రమాదం లేదని వైద్యులు తెలిపారు. ఇటీవల వాష్ రూమ్ ల మరమ్మతుల కోసం ప్రభుత్వం 30 లక్షలు మంజూరు చేసింది. కాంట్రాక్టర్. ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం వల్లనే ఈ ప్రమాదం జరిగిందని ఆరోపణలు వస్తున్నాయి.

# సెప్టెంబర్ 1న పద్మశాలి విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవం

సూర్యాపేట ప్రతినిధి(జనంసాక్షి):
సెప్టెంబర్ 1న అందజేయనున్న ప్రతిభా పురస్కారాల కొరకుజిల్లాలోని పద్మశాలి విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని పద్మశాలి సేవా సమాజ ట్రస్ట్ అధ్యక్షులు పెండెం చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023- 24 విద్యా సంవత్సరంలో 10వ తరగతి, ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో మెరిట్ సాధించిన 20 మందికి రూ.1500 చొప్పున ప్రతిభా పురస్కారాలు అందజేయనున్నట్లు తెలిపారు. 6వ తరగతి నుంచి ఇంటర్ రెండో సంవత్సరం వరకు చదువుతున్న విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, క్లాత్ బ్యాగులు ప్రముఖ పద్మశాలీల చేతుల మీదుగా సెప్టెంబర్ 1న ఉదయం 10గంటలకు జిల్లా కేంద్రంలోని పద్మశాలి భవన్ లో పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు.పద్మశాలి విద్యార్థులు ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలన్నారు.విద్యార్థులు తమ పేర్లను పద్మశాలి భవన్ లో గాని లేదా సెల్ నెంబర్ 9393510919, 7893661102 లలో తమ పేర్లని నమోదు చేసుకోవచ్చన్నారు.

# చెరుకు సుధాకర్ జన్మదిన సందర్భంగా పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం

రామన్నపేట, ఆగస్టు 30 (జనం సాక్షి) :
తొలి,మలి దశ ఉద్యమ నేత ప్రజా సేవకుడు టిఆర్ఎస్ మాజీ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు డాక్టర్ చెరుకు సుధాకర్ 64 వ జన్మదిన సందర్భంగా పట్టణములోని సిపిఎస్ (బాలుర ప్రాథమిక పాఠశాల) పేద విద్యార్థులకు తెలంగాణ ఉద్యమ నేత, టిఆర్ఎస్ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు, సామాజిక కార్యకర్త ఎస్.కె చాంద్ ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలోఏం సైదులు, డి నరసింహా, సురేఖ, స్నేహలత తదితరులు పాల్గొన్నారు.




# డెంగ్యూ మలేరియా విష జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు

## వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బొల్లు యాదగిరి



మోత్కూర్31(జనం సాక్షి): డెంగ్యూ మల్లేరియా విషవజారాలు తెలంగాణ రాష్ట్రం వ్యాప్తంగా మారుమూల ప్రాంతంలో గ్రామాల్లో విషవజారాలతో తల్లడిల్లుతున్నారని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొల్లు యాదగిరి అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం,విషవజరాలతో బాధపడుతున్న ప్రజల్ని పట్టించుకోవట్లేదని వెంటనే మారుమూల ప్రాంత గ్రామాలలో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేయాలి. హాస్పిటల్లో డాక్టర్లు కూడా సక్రంగా లేకపోవడం వైద్యానికి సంబంధించిన మందులు లేకపోవడం తో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.



# ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు

సూర్యాపేట, (జనంసాక్షి):
శ్రావణమాసం చివరి శుక్రవారం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని సంతోషిమాత దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా దేవాలయ ప్రధాన అర్చకులు ఇరువంటి శివరామకృష్ణ శర్మ తెల్లవారుజామునే అమ్మవారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక కుంకుమార్చనలు, శ్రీ చక్రంకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.సంతోషిమాత ఉద్యాపన వ్రతం నిర్వహించారు. శ్రావణ మాసం చివరి శుక్రవారం కావడంతో వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక ఊయలలో పవళింపు సేవా కార్యక్రమం నిర్వహించారు.సాయంత్రం వేళ వైభవలక్ష్మి వ్రత నిర్వహించారు.డాక్టర్ ప్రమీల ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దేవాలయ అధ్యక్ష కార్యదర్శులు నూక వెంకటేశం గుప్త, బ్రాహ్మండ్లపల్లి మురళీధర్, కోశాధికారి పాలవరపు రామ్మూర్తి, సహాయ అర్చకులు బట్టారం వంశీకృష్ణ శర్మ, దరురి కృష్ణమాచార్యులు,కమిటీ సభ్యులు కొత్త మల్లికార్జున్ బ్రాహ్మణపల్లి బ్రహ్మయ్య, సోమ శ్రీశైలం, యామా వెంకటేశ్వర్లు, బెలిదే అశోక్, పబ్బా ప్రకాష్ రావు,తాళ్లపల్లి రామయ్య, దేవరశెట్టి సోమయ్య, బాలచంద్రుడు, శివప్రసాద్, సంతోష్, రామ్ కుమార్, నాగమణి,శ్రీదేవి, వనజ,పద్మ, సూర్యకళ, రత్నమాల, బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, మెషిన్ లెర్నింగ్ లో గణిత పాత్ర

నల్గొండటౌన్, ఆగష్టు 30(జనంసాక్షి)
గణిత విభాగాధిపతి డాక్టర్ మద్దిలేటి పసుపుల అధ్యక్షతన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు మిషన్ లెర్నింగ్ లో గణితం పాత్ర ప్రపంచం ఎదుర్కొంటున్న సవాలు ప్రసంగించడానికి వచ్చిన ప్రొఫెసర్. పెంట్యాల శ్రీనివాస్ రావు మాట్లాడుతూ విద్యారంగంలో, వైద్యరంగంలో, విజ్ఞాన శాస్త్ర పరిజ్ఞానంలో, డాటా సైన్స్ లో ఏ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మరియు మిషన్ లెర్నింగ్ పాత్రను వివరిస్తూ మూలం గణితం అని వివరించారు. అదేవిధంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ భవిష్యత్తులో ఐఐటి మరియు ఎన్ఐటి లో పీజీ మరియు ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉండే పరిశోధన మరియు ప్రాజెక్టు అసిస్టెంట్ అవకాశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ సైన్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టర్ కొర్రిపల్లి ప్రేమ్ సాగర్, బి ఓ ఎస్ చైర్మన్ డాక్టరు ఉపేందర్ రెడ్డి, మరియు అధ్యాపకులు డాక్టర్ ఏ శ్రీనివాస్, డాక్టర్ ఎన్ కిరణ్ కుమార్, డాక్టర్.ఎం రామచంద్రుడు, డా. భిక్షమయ్య మరియు ఇంజనీరింగ్ కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్, మ్యాథమెటిక్స్ విద్యార్థులు పాల్గొన్నారు.






# జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు మహిళా హెడ్ కానిస్టేబుళ్ల కు ఏ.యస్.ఐ లు గా , ఒక కానిస్టేబుల్ కి హెడ్ కానిస్టేబుల్ గా పదోన్నతి

## పదవితో పాటు బాధ్యతలు కూడా పెరుగుతాయి జిల్లా ఎస్పి

నల్గొండటౌన్, ఆగష్టు 30(జనంసాక్షి)
నల్గొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లాలో పనిచేస్తున్న ఇద్దరు మహిళా హెడ్ కానిస్టేబుళ్లు గోపమ్మ,ఉమా రాణి లకు ఏ.యస్.ఐ లుగా పదోన్నతి మరియు కానిస్టేబుల్ సురేష్ కు హెడ్ కానిస్టేబుల్ గా పదోన్నతి పొందిన సందర్భంగా జిల్లా ఎస్పీ స్టార్ మరియు పట్టీలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా యస్.పి మాట్లాడుతూ పదోన్నతితో పాటు బాధ్యతలు కూడా పెరుగుతాయని, ప్రజలతో మమేకం అవుతూ బాధ్యతతో పని చేసి ప్రజల యొక్క మన్ననలు పొందే విధంగా పని చేయాలి అన్నారు. పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులతో మర్యాద పూర్వకంగా ఉంటూ వారి యొక్క సమస్యల అడిగి తెలుసుకొని బాధితులకు సరిఅయిన న్యాయం జరిగే విదంగా పనిచేయాలని అన్నారు. అప్పుడే పోలీస్ శాఖకు గౌరవం వస్తుందని, దానిని పెంపొందే దిశగా పనిచేసి నల్లగొండ జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకరావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రాములు నాయక్, ఎస్బి డిఎస్పీ రమేష్,ఏ.ఓ శ్రీనివాస్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు జయరాజు, సోమయ్యతదితరులు పాల్గొన్నారు.

# రుణమాఫీ కానీ ప్రతి రైతు వివరాలు సేకరిస్తాం: శ్రవణ్ కుమార్



చిట్యాల ఆగస్ట్ 30(జనం సాక్షి)
రుణమాఫీకి అర్హులై రుణమాఫీ రాణి ప్రతి రైతు వివరాలు సేకరించేంతవరకు ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమం కొనసాగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ కుమార్ అన్నారు.చిట్యాల మండలంలో రేషన్ కార్డు లేని కారణం చేత రుణమాఫీ కాని రైతులకు కుటుంబ నిర్ధారణ చేసి తద్వారా రుణమాఫీ వర్తించేటట్లుగా చేయడానికి చేపట్టిన కార్యక్రమం లో భాగంగా శుక్రవారం నాడు సుంకనపల్లి గ్రామంలో పాల్గొని మాట్లాడుతూ రేషన్ కార్డు లేకుండా రుణమాఫీకి దూరమైన రైతులందరికీ ప్రతి గ్రామంలో సర్వే చేసి రైతు కుటుంబాల వివరాలు సేకరించి ఈ యాప్ లో అప్లోడ్ చేసి రుణమాఫీ వర్తించేటట్లుగా చేస్తామని చెప్పారు.రైతు కూడా ఆందోళన చెందవద్దని భరోసా ఇవ్వడం జరిగింది.రేషన్ కార్డు లేని రైతుల వివరాలను చిట్యాల మండల వ్యవసాయ అధికారి,నోడల్ ఆఫీసర్ పగిడిమరి గిరి బాబు రేషన్ కార్డు లేని రైతులకు కుటుంబ నిర్ధారణ చేసి రుణమాఫీ యాప్ లో వివరాలను అప్లోడ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు వీణకుమారి, కృష్ణకుమారి సుంకనపల్లి గ్రామస్తులు పాల్గొనడం జరిగింది.

# ఉద్యోగవృత్తిలో అంకితభావంతో పనిచేసిన వారికి గొప్ప గౌరవం దక్కుతుంది : ఎంఈఓ నకిరేకంటి రవి

## బదిలీపై వెళ్ళిన ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయురాలుకి సన్మానం



పెన్ పహాడ్ ఆగస్ట్ 30 (జనం సాక్షి) :
ఉద్యోగ వృత్తిలో అంకితబావంతో పని చేసిన ఉపాధ్యాయులకు సమాజంలో గొప్ప గౌరవం ఉంటుందని మండల విద్యాధికారి నకిరేకంటి రవి అన్నారు, శుక్రవారం మండలంలోని ఎల్లప్పకుంట తండ గ్రామంలోని ఎంపీ పీ ఎస్ పాఠశాలలో విధులు నిర్వహించిన ఉపాధ్యాయురాలు శ్రీమతి పాపని వాణి, ఇటీవల బదిలీ పై దూపహడ్ కు వెళ్ళగా ఆమె పాఠశాలలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు, వాణి అంకితభావంతో చక్కటి విద్యాబోధన చేసి,విద్యార్థుల అభివృద్ధి కి తోడ్పడ్డారని,వారి సేవలను కొనియాడారు, ఈ సన్మాన కార్యక్రమం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పీఆర్టీయూ టీఎస్ మండల అధ్యక్షులు సంధ్యాల వినోద్ అధ్యక్షతన నిర్వహించగా ఈ కార్యక్రమం లో మండల నోడల్ అధికారి దారావత్ వస్రామ్ నాయక్, పి ఆర్ టి యు టీఎస్ మండల ప్రధానకార్యదర్శి నల్ల శ్రీనివాసులు, చెట్ల ముకుందా పురం ప్రధానో పాధ్యాయులు గోపతి రామారావు, జిల్లా ఉపాధ్యక్షులు సంద సైదిరెడ్డి, జాకబ్ రాజ్ కుమార్, ఉపాధ్యాయి నీలు, మేడారపు శైలజ, ముత్తినేని స్నేహలత, మహేశ్వరీ, ఎస్ ఎం సి మాజీ చైర్మన్ బాదావత్ రమేష్, అంగన్వాడీ ఆయా గుగులోత్ బుజ్జి,శంకర్, నీలమ్మ, స్వాతి,ఇనూష, విద్యార్థులు,తదితరులు, పాల్గొన్నారు...



# భారీ సంఖ్యలో బీజేపీ సభ్యత్వ నమోదు చేయండి

### బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగిడి మనోహర్ రెడ్డి

మర్రిగూడ, ఆగస్టు 30,( జనం సాక్షి)
భారీ సంఖ్యలో బిజెపి సభ్యత్వం నమోదు చేయండి, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్ రెడ్డి భారతీయ జనతా పార్టీ మర్రిగూడ నాంపల్లి మండలాల సభ్యత్వ నమోదు కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ దేశావ్యాప్తంగా బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం సెప్టెంబర్ 2 తారీకున ప్రారంభించడం జరుగుతుందని మండలల్లో భారీ ఎత్తున సభ్యత్వ నమోదు చేయాలని కోరారు. సెప్టెంబర్ 5 తారీకు నుండి 26 తారీకు వరకు ప్రతి బూత్ లో 200 మంది ని సభ్యులుగా చేర్చాలని అన్నారు. రాబోయే రోజులలో గ్రామీణ స్థాయిలో పార్టీ ని బలోపేతం చేయడం కోసం ప్రతి గ్రామాలలో అన్ని వర్గాల ప్రజలను సభ్యులుగా నమోదు చేయాలని అన్నారు.ఈ సందర్భంగా మర్రిగూడ బీజేపీ మండల అధ్యక్షులు పాత్లావత్ రాజేందర్ నాయక్ మాట్లాడుతూ మర్రిగూడ మండలంలో బీజేపీ సభ్యత్వ నమోదు ను ప్రతి బూత్ 200 మంది సభ్యులను చేయాలని పార్టీ నాయకులను కోరారు.ఈ కార్యక్రమం లో మర్రిగూడ మండల అధ్యక్షులు పాత్లావత్ రాజేందర్ నాయక్,బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎరెడ్ల శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర నాయకులు యాస అమరేందర్ రెడ్డి, మునుగోడు అసెంబ్లీ కన్వీనర్ దూడల బిక్షం గౌడ్, సభ్యత్వ నమోదు ఇంచార్జి సోమ నర్సింహా గుప్తా,శంకర్ నాయక్,నర్సింహా చారి,కుక్కల వెంకటేష్ జిల్లా కిషోర్,అంబాల రమేష్, చెల్లం శంకర్, వట్టికోటి జగన్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# భగవద్గీత శ్లోకాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం



కొండమల్లేపల్లి, ఆగస్టు 30 ( జనంసాక్షి ) :
త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి తరపున నల్గొండ కమిటీ ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలో భగవద్గీత శ్లోకాలు ఫైనల్ పోటీలు నిర్వహించారు భగవద్గీత శ్లోకాల పోటీలలో ప్రతిభ కనబరిచి సాయి సిద్ధార్థ పాఠశాల విద్యార్థి కార్తిక్ ప్రథమ బహుమతి, గౌతమి స్కూల్ విద్యార్థి ద్వితీయ బహుమతి, శ్రీ కృష్ణవేణి విద్యార్థి కిరణ్ తృతీయ బహుమతులను పొందారు ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం నల్గొండ సేవా సమితి, హిందూ జ్ఞాన వేదిక నల్గొండ కమిటి అధ్యక్షుడు, సభ్యులు పడిగిమర్రి వెంకటేశం, మేకల శ్రీనివాసులు, మేకల చంద్రమౌళి, చక్రదర్, పరమేశ్, కార్తీక్, రంగారెడ్డి, వెంకటమ్మ, కవిత, వివిధ పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రయోజన ప్రభుత్వ పథకాలను సకాలంలో అందించాలి

### జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ శివరామకృష్ణ




భువనగిరి ప్రతినిధి ఆగస్టు 30 (జనం సాక్షి)
పంట రుణమాఫీకి సంబంధించిన ప్రజా ప్రయోజన ప్రభుత్వ పథకాలను సకాలంలో అందించాలని జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ శివరామకృష్ణ సూచించారు.సంబంధించిన ప్రయోజనాలకు అర్హులైన లబ్ధిదారులకు అందించే ప్రయత్నం చేయాలన్నారు.శుక్రవారం యాదగిరి గుట్ట ఎంపిడిఓ కార్యాలయంలో ఆలేరు బ్లాక్ జాయింట్ మండల స్థాయి బ్యాంకర్ కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు.లీడ్ బ్యాంక్ యాదాద్రి భువనగిరి జిల్లా మేనేజర్ శివ రామ కృష్ణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం లో నాబార్డ్ డి డి ఎం వినయ్ కుమార్ , డి వి ఏ హెచ్ ఓ, జె డి కృష్ణ , ఎస్ సి కార్పొరేషన్ ఇ డి శ్యాంసుందర్, యాదగిరి గుట్ట ఎంపిడిఓ నవీన్ కుమార్, డి ఆర్ డి ఏ అదనపు పీడీ శ్రీనివాస్, ఏ డి ఏ శాంతి నిర్మల పాల్గొన్నారు.వివిధ ప్రభుత్వ పథకాలకు సంబంధించిన అంశాలను సమావేశంలో వివరించారు.ఆలేరు బ్లాక్ కు సంబంధించిన అన్ని బ్యాంకర్లు, అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

# రుణమాఫీ కానీ రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

కోదాడ,ఆగస్టు30,జనంసాక్షి:
అర్హత ఉండి రుణమాఫీ కానీ రైతుల కుటుంబ సభ్యుల నిర్ధారణను అన్ని గ్రామాల్లో చేపడుతున్నట్లు మండల వ్యవసాయ అధికారి అందే సతీష్ తెలిపారు.శుక్రవారం పాలారం గ్రామంలో రుణమాఫీ కానీ రైతుల నుంచి వారు దరఖాస్తులు స్వీకరించి మాట్లాడారు.షెడ్యూల్ ప్రకారం అన్ని గ్రామాలకు వ్యవసాయ అధికారులు వచ్చి రేషన్ కార్డు లేని రైతుల వద్ద కుటుంబ ధృవీకరణ పత్రాలు తీసుకుంటారు.కావున ఆ తేదీల్లో రైతులు అందుబాటులో ఉండి దరఖాస్తులు ఇవ్వాలని కోరారు.ఇట్టి కార్యక్రమంలో ఏఈఓ అన్వేష్,పంచాయతీ కార్యదర్శి వెంకటేష్,రైతులు రామకోటయ్య,ఏడుకొండలు,లక్ష్మయ్య,ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.



# ఉద్యమకారుల చైతన్య యాత్రను విజయవంతం చేయండి..

### ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇవ్వాలి

### - తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా జనరల్ సెక్రెటరీ కొంకా లక్ష్మీనారాయణ



భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 30 (జనం సాక్షి): యాదాద్రి భువనగిరి జిల్లాలో ఆదివారం నాడు జరగబోయే తెలంగాణ ఉద్యమకారుల చైతన్య యాత్రకు భూదాన్ పోచంపల్లి పట్టణ మరియు మండల ప్రజలు, ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం జిల్లా జనరల్ సెక్రెటరీ కొంకా లక్ష్మీనారాయణ శుక్రవారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆదివారం రోజు ఉదయం 10 గంటలకు భువనగిరి చౌరస్తా నుండి చైతన్య యాత్ర మొదలవుతుందని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం మరియు పింఛన్ 20000 రూపాయలు తక్షణమే అమలు చేయాలని, ఈ చైతన్య యాత్ర చేస్తున్నామని వారు అన్నారు.

# మంత్రివర్గంలో ఎమ్మెల్యే బాలు నాయక్ కి స్థానం కల్పించాలి: పెద్దిశెట్టి సుధాకర్



కొండమల్లేపల్లి, ఆగస్టు 30 ( జనంసాక్షి ) :
కొండమల్లేపల్లి మండల కేంద్రానికి సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దిశెట్టి సుధాకర్ మాట్లాడుతూ పేదల పెన్నిధి బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, గిరిజన ముద్దుబిడ్డ దేవరకొండ నియోజకవర్గం శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ కి రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణలో స్థానం కల్పించాలని ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డిని కోరారు రాజకీయాలలో విద్యార్థి దశ నుండి చురుగ్గా పాల్గొని జడ్పిటీసి గా, నియోజకవర్గం ఇంచార్జిగా,రెండు సార్లు ఎమ్మెల్యే గా,జెడ్పి చైర్మన్ గా పదవులు చేపట్టి సుదీర్ఘ అనుభవం కలిగిన నాయకుడికి మంత్రిగా స్థానం కల్పించి గిరిజన బిడ్డలను గౌరవించాలని కోరుతున్నట్లు ఒక ముఖ్య ప్రకటనలో పేర్కొన్నారు.